# శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

## ఇలాంటి తవ్వాయి వస్తే....?

"శివశివా! పక్కనే అంత గట్టుండగా యేమి పని సాయిబూ అదీ? నిక్షేపంవంటి చెరువులోనే పుక్కిలించి వుమ్మేసుకోవాలా? మీకు మాత్రం మెంగిలి తప్పు కాదూ? కాండ్రించి కూడా— చెప్పినకొద్దీ మరీనీ! పోనీ, నీయిష్టంవచ్చినట్టు చేసుకో. ఎవళ్లెంత చేసుకుంటే అంతా వాళ్లే అనుభవిస్తారు, నాకేం?"

"నీకీ బుద్ధీ వుందీ లేదూ షోంయాజుల్?"

మండిపడుతూ అందుకున్నాడు సాయిబు.

"ధుస్కా ధుస్కా పీదీపీదీ చెర్వూ హాంతా గలీజ్ చేసీ, హింకా మాకీ హాచ్ఛేపన్ చేస్తావ్?"

ఉలిక్కిపడ్డాడు రామప్పసోమయాజులు. మరి, మాట్లాడలేక పోయాడు కూడా.

"బుద్ధిగడ్డి తిని పలకరించా" నని కూడా చాలా పశ్చాత్తాప పడ్డాడు.

"ఇంతటితో నన్ను కటాక్షించి యిక నువ్వు వెళ్లిపో మహా ప్రభూ!" అంటూ కళ్లతో ప్రార్థించాడు కూడా.

ఎలాంటి కళని వున్నాడో, మరి, సాయిబున్నూ మాట్లాడ లేదు.

అయితే, అతను వొడ్డెక్కుతూ వుండగా, మెత్తెత్తి కాళ్లు వేసుకుంటూ సోమయాజులు వెధవకూతు రెదురయింది పాపం చాలమీద.

మొగం చిట్లించుకుంటూ వొక పక్కకున్నా వోసరిల్లిందామె.

ఆవాలకం చూసి చాలా చిమచిమలాడాడు సాయిబు.

కానయితే, అతనూ వొక పక్కగానే వున్నాడు.

ఆదారి తప్పా లనీ లే దతనికి.

కాని, అయిమూల మొగం పెట్టుకుని చూశాడు మొదట.

ఏమిటేమిటో గొణుక్కున్నాడు.

పావంచాలమీద కూడా తుబుకూ తుబుకూ వుమ్మేస్తూ గబగబా చక్కాపోయాడు, చివరికి

ఒక్కమాటు వెనక్కి తిరిగిచూసి, అక్కడికీ కంఠం కొంచెం నొక్కుకునే "యెవర్ని నాయనా?" అనడిగిం దామె తండ్రిని.

"ఇంకెవర్నీ? ఈశ్వరుడు లేడూ? తిట్టుకోనీ"

"అస లెందుకు వచ్చిందీ గొడవ?"

"కాండ్రించి చెర్లో వుమ్మేస్తావా?" అన్నాను. అదిగో, అదీ నావల్ల వచ్చిన అపరాధం. ఇక వొకటేమిటి—నానా మాటలూ—హరోంహర"

పెద్దపెద్ద కెరటా ల్లేచేటట్టు మూడుమాట్లు మునిగి స్నానం చేశాడు సోమయాజులు.

సాయిబు వుమ్మి యెక్కడ తేలుతోందో అని బెదిరి బెదిరి చూస్తూ, నీటిలో కూడా యెత్తెత్తే కాళ్లు వేసుకుంటూ, యెక్కడో వుండివుంటుం దనుకున్న ఆవుమ్మి దూరానికి పోయేటట్టు బిందెతో కెరటాలు రేపెట్టసాగిం దామె.

ఇంతలో మళ్లీ మూడుమాట్లు మునిగి, లేచి, యాజులు ఆచమించి సంకల్పం ప్రారంభించాడు.

కాని, యాదాలాభంగా యెడమవైపు చూడగా, కుండలు కొందరూ బిందెలు కొందరూ చేతబుచ్చుకుని పాతికముప్ఫయి మంది మాదిగవనితలు ఉత్తరపు గట్టు పొడూగునా నుంచుని వున్నారు, వరాసగా.

అది చూసి గతుక్కుమనిపోయాడతను, మొదట.

అదేమిటో యెందుకో అర్థంకాక, కళ్లు చికిలించుకుంటూ నిదానంగా చూశాడు, తరవాత.

అప్పటికీ నిర్ధారణచేసుకోలేకపోయాడు.

“అదేమిటే అమ్మాయీ?” అనడిగాడప్పుడు, తర్జనితో నిర్దేశిస్తూనూ, అటే చూస్తూనూ.

హఠాత్తుగా చూసిందామె.

అర్థంచేసుకోలేక ఆమె కూడా గజిబిజిపడిపోయింది.

“ఏం, కనపడ్డం లేదూ?” అని మళ్లీ అడిగాడతను.

“కనపడింది, కనపడింది;—కొండ మునిగిపోయింది నాన్నోయ్!” అంది.

“మాదిగలేనా వాళ్లు?” అనడిగాడు యాజులు, వొణికిపోతూ.

“అవు నవును. మన చెరువులో దిగుతారు కామోసు నేమిటే గతీ?”

“అదేమి పోయే కాలం?”

ఇలా అడిగినప్పు డతని మాటలో కూడా వొణుకు పుట్టింది, స్పష్టంగా.

"కాంగ్రీసువాళ్లు తీసుకువచ్చివుంటారు నాన్నా వాళ్లని"

"వాళ్లపనే యిది, సందేహం లేదు"

"ఈచెరువులో తప్ప మరెక్కడా మంచినీటి చుక్కల్లేవు"

"తీరా కాలవలు కట్టేశాక—హరహరా! ఎంత ఘోరకలో చూశావా?"

నిప్పులు తొక్కుతున్నట్టయిపోయాడు, సోమయాజులు.

దాంతో, మళ్లీ వొణికిపోతూ, అక్షరాల పోలిక లేకుండా వొక్క పొలికేక పెట్టాడతను.

కాని, యెవరూ వినిపించుకోలే దది.

"పోరేం?...పోతారా పోరా?"

"మంచినీళ్లకి వచ్చామండి" అంది, మాదిగస్త్రీ వొకామె, ముసిలిది.

"మాచెరువుకే?"

"మీదేమిటి మాదేమిటి, వొక్కడే చెరువు చేశాడండి. దేవుడు, నూరందరికీ.

"స్వారాజ్యమూ లేదు, వల్లకాడూ లేదు, దేశం అంతా మాలకూ డయిపోతోంది" అంటూ పళ్లు కొరుక్కుం దతని కూతురు.

"ఆ, అలాగేం? ఎవళ్లే మిమ్మల్నిక్కడికి తీసుకువచ్చిన వాళ్లు?"

"దేవుడే నండి, మరెవరు తీసుకువస్తారు బాబయ్యా, మమ్మల్ని?"

"అబ్బో, దేవుడే తీసుకువచ్చాడేం?"

"అవునండి"

"దేవుడు దిగివచ్చాడు మీకోసం, మహామహా యజ్ఞాలు చేసిన మావంటివాళ్ళకి దిక్కులేదు గాని"

"దిక్కులేనివాళ్ళకి దేవుడే దిక్కు బాబయ్యా, మీకేం ?"

"అలాగేం ? అయితే, మీ చెరువు వేం చేసుకోమన్నాడూ ఆ దేవుడు మరి ?"

"కుష్టురోగపులచ్చిగాడు దాన్లోపడి చచ్చిపోయాడు బాబయ్యా !"

"చచ్చిపోతే ?"

మళ్లీ వొక పొలికేక పెట్టాడు సోమయాజులు.

"ఆనీళ్లెలా తాగమండీ దొరగారూ ?"

"ఏం, కల్లుకంటే చెడిపోయాయా ?"

"ఏలినవారికి కోపంవస్తే చెప్పలేను గానండీ, చాకళ్లు దిగడం లేదండీ మీ చెరువులో ?"

స్తబ్ధుడయిపోయాడు సోమయాజులు.

"తురకలు దిగుతున్నారు గదా, స్నానం చేస్తున్నారండి మీరు ?"

పులిమీద పుట్ర యిది.

"దిగుతున్నారు గదా ?" అని వూరుకుంటే బాధ లేక పోవును, "ఏం చేస్తున్నా"రని ముదలకించిం దామె నిలవతీసి.

చాలా కోపం వచ్చిం దతనికి.

అంతకంటే యెక్కువగా కంఠమూ బిగుసుకుపోయింది.

"ఆ, ఆ, చాకళ్లూ మీరూ సమానం లే ?" అనడిగింది సోమయాజులు కూతురు.

"...మున్సబుకరణాలకు తెలిస్తే పాతేస్తారు, తొరగా— యింకా నుంచుంటారేం?"

"నీళ్లు ముంచుకోకుండా వెళ్లి యేమి చెయ్య మంటారు బాబయ్యా?"

"దానికి బదులుచెప్పవలసిన పూచీ మాకేమీ లేదు. చెరువులో దిగారంటే, మొహామ్మాయివండించేస్తాను మిమ్మల్ని, పొండి, వెనక్కి మళ్లండి."

"అయితే, మేము దూరంగా వెళ్లిపోతాం, మాకుండల్లో నీళ్లు పోసి వెళ్లి పొండి కామందులు" అంది విస్సిగాడి పెళ్లాం.

"అబ్బో, అలాగేం?" అంటూ ముదలకించాడు యాజులు, ముందు.

"యజ్ఞం చేసిన ముండావాణ్ణి, నేను వచ్చి మీకుండల్లో నీళ్లు పొయ్యాలేం?" అంటూ నిలవతీశాడు తరవాత, తల తాటించుకుంటూ.

"పోతారా, వొడ్డెక్కనా? అంటూ వొణికిపోతూ నీటిలోనే పరవళ్లు తొక్కా డతను, చివరికి.

మాదిగలు కదల్లేదు.

"మాటకి మాట యెలా అందిస్తున్నారో చూశావా? వాళ్లలో, అదెవర్తో, అది మరీని. స్నానం కూడా చేశావు నువ్వు, వాళ్లతో మాట్లాడకు నాన్నా" అంది కూతురు.

నిప్పులు కక్కుతూ అటు చూశాడు యాజులు; కాని మాట్లాడలేదు.

ఎక్కణ్ణుంచో వస్తున్నాడు శంకరశాస్త్రి, ఇదంతా చూశాడు, విన్నాడు కూడా; కాని నోరుమెదపలేదు, బుర్రవంచుకుని వ్రాల్లోకి వెళ్లిపోయాడు.

స్నానం చేదా మని వచ్చాడు శంభన్నశాస్త్రి, చెంబు తోముకుంటూ; కాని సంగతంతా చూసి పక్కనే వున్న రామి నీడుగారి గాదెలసావడి అరుగుమీదికి వెళ్లి కూచున్నాడు, మాట్లాడకుండా.

బిందె పట్టుకువచ్చిం దొక శమ్మశాస్త్రి. "రోజులు మారి పోయాయి బాబయ్యా, అని మాత్రం అని, నిదానంగా చూసి బిందె ముంచుకుని చక్కాపోయింది.

సుబ్బిశెట్టివచ్చాడు రేవులోకి, వొక చివరికి వెళ్లి కాళ్లు కడుక్కుని చక్కాపోతూ "త్వరగా తెమల్చుకోండి బాబయ్యా" అంటూ.

తెమల్చుకోడమే మంచి దనుకున్నాడు సోమయాజులుకూడా.

"లేవా ల్లేవా" లంది కూతురు కంగారుగా.

"అదిగో, రామినీడుగారి అబ్బులు కామోను వాళ్లకుండల్లో నీళ్లు పొయ్యడానికి బిందె పట్టుకువస్తున్నాడు. అతను వాళ్ల కుండల్లో పోశాటప్పుడు కొన్నయినా కిందపడి చెరువులోకి దారి తీస్తాయి నీళ్లు, తెముల్చుకో తెమల్చుకో" అంటూ అతణ్ణి కూడా కంగారుపెట్టిం దామె.

ఈమాట చెవిని పడేటప్పటికి, సోమయాజులికి, కరిగిన సీసం కాళ్లకిందికి పాకివస్తున్న ట్టయింది.

మరి, ఆగలేక పోయాడు.

జంధ్యాలు తోముకోకుండా—వొళ్లసలే తోముకోకుండా—కట్టుబట్ట పూర్తిగా తడిసిందో లేదో చూసుకో నయినా చూసుకోకుండా గభీమని వొడ్డెక్కి—పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ—దుముకుతూ యింటికి వెళ్లి పోయాడు.

“నిక్షేపం. గంగాళం వంటి చెరు విక నాశనం అయిపోతుంది కామోసు. కాలవలు కట్టేశా రేందారీ?” అని సాగతీసుకుంటూ, ఆదరాబాదరా బిందె ముంచుకుని, ఆమె కూడా అతని వెనకనే యెగిరిపోయింది, పిట్టలాగ.

౨

ఎన్ని తరాలనుంచో మాదిగల కొక చిన్నదీ, తక్కిన అన్ని కులాలవారికీ వొక పెద్దదీ—మంచినీళ్ల చెరువులు రెండున్నా యావూళ్లో.

ఒకటే పెద్దచెరువు నాలుగుభాగాలు చేసి, మూడు భాగాలొకటీ, వొక్క భాగమే అయేట ట్లొకటీ అయేటట్టు గట్టుపొయ్యగా యేకకాలాన యేర్పడ్డ చెరువు లవి.

పెద్దచెరువు నిలవనీరు పోవా లంటే, చిన్నచెరువే అందుకు దారి.

చిన్నచెరువులోకి కొత్తనీరు రావాలంటే పెద్దచెరువే అందుకు మార్గం.

ఆ రెండు చెరువులూ కలిపే తూము తరుచు తెరిచే వుంటుంది.

ఆ తూముదగ్గిర, మాదిగలు, తమ చిన్నచెరువులో మావులు కట్టుకుంటూ వుంటూ రప్పుడప్పుడు.

తూ యెప్పు డయినా చెడిపోతే, అది, బాగుచెయ్యవలసిన బాధ్యతయెప్పుడూ మాదిగలదే, వారు పెద్దచెరువులో మాత్రం దిగడానికి వీలులే దప్పు డయినా—అంతే.

రెండేళ్లకీ మూడేళ్లకీ వొకమారు పెద్దచెరువులో చేపలవేట జరుగుతూ వుంటుంది.

వేసవి గడచి, కాలవలు తెరిచాక, వొకనాటి పగలు పన్నెండు గంటలవేళ రెండుచెరువుల పాత నీరూ విడిచిపెట్టేస్తారు పూర్తిగా.

మూడుగంట లయింది మొదలు మాదిగలు తప్ప బ్రాహ్మ లున్నా—వైశ్యులుకూడా తప్ప తక్కిన అన్నికులాల మత్స్య భుక్కులూ పెద్దచెరువులో వీరవిహారంచేస్తా రావేళ.

చేపల సమ్మర్దం తగ్గాక, అంటే అయిదయ్యాక మాదిగలు కూడా పెద్దచెరువులో స్వేచ్ఛగా దిగవచ్చు, ఏమయినా దొరికితే చేపలూ పట్టుకోవచ్చు; ఆరాత్రి మళ్లీ కొత్తనీరు పెట్టాక మాత్రం, ఎలాంటి సందర్భంలోనూ కూడా మళ్లీ దిగడానికే కాదు, వొడ్డున వుండి వంగి అయినా నీళ్లు ముట్టుకోడానికి వల్ల కాదు వాళ్లు.

ఆవూరు యెనభై యిళ్ల వెలనాటి అగ్రహారం.

మున్సబుకరణాలున్నా ఆదినుంచీ ఆవూళ్లో ఆశాఖ వారే.

వైదికవిద్యలకు చాలాకాలం అదొక గొప్పపీఠం.

వెనకటి కావూళ్లో తపోధను లెందరో వుండేవా రనీ, వారిలో నలుగు రైదుగురు ఆపెద్దచెరువులో స్నానంచేసి గుండెల్లోతున నిలిచి గాయత్రీజపం చేసుకుంటూ, చుంగలు తీర్చి పైబట్ట

పై కెగరవేస్తే, వారు మళ్లీ "పరమేశ్వరార్పణ మస్తు" అనేదాకా గొడుగులాగ అది అలాగే వుండిపోయే దనీ చెప్పుకుంటా రావూళ్లో.

అలాంటి వూళ్లో యింగ్లీషు ప్రవేశించింది.

అయితే, పాతికసంవత్సరాలు గడిచినా అందులో దిగినవా రందరూ చిలకొట్లుగానే గాని, పట్టాపొందినవారుగా వొక్కరూ తయారు కాలేదు.

రైతాంగం అంతా కమ్మవారు రెండు వందలు పైగా వుంటుంది వారి గడప.

ఊరిపెత్తనం ఆదినుంచీ వారిదే.

శెట్టిబలిజలూ, కలాలీలూ, కొప్పువెలమలూ, చాకళ్లూ, మంగళ్లూ—ఇలాంటివారు కూడా ఆవూళ్లో బాగా తక్కువే; కాని మాదిగపల్లెలో మాత్రం యాభైకి పైగా వున్నాయి కొంపలు.

అది యెప్పు డెందు కెలా తటస్థించిందో ముప్ఫయితొమ్మిది ళ్ల తురకలు కూడా వున్నా రావూళ్లో.

వారిలో యిద్దరు ముగ్గురు తోళ్లవర్తకులు మాత్రం కొంచెం మోతుబరులు, తక్కినవా రందరూ నాదారుకమే.

కమ్మవీధి నానుకునే వుంది వారి మసీదు.

ఆవూరి గ్రామదేవత కమ్మవారి ఆడబడుచు.

ఆఅమ్మవారి వూరేగింపు తురకవీధికి వెళ్లకూడదు, తురకల పీర్లసంబరం మాత్రం వూరంతా తిరుగుతుంది.

మిషనరీలు వచ్చి మాదిగపల్లెలో కొందరికి మతదీక్ష యిచ్చారు.

ఒక పాఠ శాల కూడా పెట్టారు.

చిన్నా పెద్దా పదిపన్నెండు క్రాఫింగుబుర్రలున్నా వెలి శాయి, పల్లెలో.

కాని—కాని—అంతే.

మరి ముందుకి వెళ్లలేదు మాదిగలూ, మతం పుచ్చుకున్న వారూ కూడా.

మాదిగలతో పాటు—కిరస్తానీపంతులు కూడా, మాదిగ పల్లెలోనే—వొక పూరిగుడిసెలోనే కాపరం.

మతంలో కలియడంవల్ల మాదిగలకు వచ్చిన కొత్తపరపతి యేమీ లేదు.

ప్రయిమరీలో తేలిన మొగపిల్ల లయినా తక్కిన మాదిగ పిల్లలతో పాటు కమ్మవారి దగ్గిర పాలికాపుతనమే చేస్తారు.

ప్రయిమరీలో తేలిన ఆవూరి క్రైస్తవపడుచులూ, ఆవూరి కోడళ్లూ కూడా గంపలు పుచ్చుకుని పొలాల్లో తిరుగుతూనే వుంటారు.

మతమూ పేరూ మార్చుకుని క్రాపింగు పెట్టుకున్నా పుట్టు గోచ పెట్టుకుని, దుడ్డుకర్ర బుజాన వేసుకుని సర్కారుపనిమీద తిరిగాటప్పుడు కూడా బ్రాహ్మలు తారసపడితే "తప్పుకోండి బాబయ్యా" అంటూ గోడలవారగానే—పెంటకుప్పలమీదు గానే తిరుగుతూ వుంటారు మాదిగ పెద్దలు.

మొత్తానికి, మాదిగల కయినా, కిరస్తానీల కయినా యివాళ కూలిపని చేస్తేనే రేపుబువ్వ.

అయితే, సంవత్సరం కిందట, ఆవూరు బదిలీ అయివచ్చిన కిరస్తానీపంతులు మాత్రం కొంచెం ఘటికుడు.

బుర్రవంచుకుపోయే రకం మాత్రం కాదు.

## 3

శవదహనం చేసుకోవచ్చు నని దయతో సెల విచ్చి పోలీసులు వెళ్లిపోయారు.

ముందు కొత్తనీరు వచ్చే తూము బిగించేసీ, తరవాత పాత నీరు పోయే తూము తెరిచేసీ తమ చెరువులో పడి, మాదిగలు, లచ్చిగాడి ధర్మమా అని గంపెడేసి చేపలు పట్టుకున్నారు.

కమ్మవారూ, సెట్టిబలిజలూ, కలాలీలూ, చాకళ్లూ, మంగళ్లూ, —చెరువుదగ్గిర సమయానికి స్త్రీ లుంటే స్త్రీలూ, పురుషు లుంటే పురుషులూ గట్టుమీదికి తెచ్చి రెండుదినాల పాటు మాదిగలకు నీళ్లందించాటప్పటికి చుక్కలు దుళ్లాయి.

అప్పటికి పొయ్యడానికి సవర్ణులూ పోయించుకోడానికి మాదిగలూ కూడా విసిగిపోయారు.

ఈస్థితి వచ్చాటప్పటికి కిరస్తానీపంతులుకి కొరడాకొస తగిలినట్టయింది.

మాదిగల మాట యేమయినా, పెద్దచెరువులో తురకలు దిగితే మాట్టాడని సవర్ణులు, కిరస్తానీలను—కనీసం చదువుకున్న తన కయినా దిగనివ్వకపోడం చూడగా, ఆవూరువచ్చినప్పణ్ణుంచీ గుర్రుగానే వుంటోం దతనికి.

"ఎప్పుడో యిక్ష్వాకులనాడు రాజ్యాధిపత్యం చెలాయించి వుండిన యిస్లాముమతాని కాగౌరవం యేమిటి, యిప్పుడు రాజ్యాధిపత్యం చెలాయిస్తూనే వుండిన క్రైస్తవమతాని కీఅగౌరవం యేమిటీ?" అని యెన్నోమాట్లు తర్కించుకున్నా డతను.

అలా తర్కించుకున్నప్పు డల్లా, మిషనరీల ప్రవృత్తే తమ యీ దౌర్భాగ్యాని క్కారణం అన్నట్టు తోస్తూవచ్చిం దతనికి.

"తెలిసా, తెలియకా ? నయానా, భయానా ?" అన్న ప్రశ్నలు విడిచిపెట్టేస్తే, యిస్లాం మతంలోనూ కలిశారు హిందువులు.

అయితే, వారు, హిందువులకు దూరంగా వెళ్లిపోలే దెక్కడికీ.

అలా కలిసినవారిలో పంచములూ వున్నారు.

వారూ దూరంగా వెళ్లిపోలేదు, హిందువులకు.

హిందువుల మధ్య—సవర్ణులపక్కన—బ్రాహ్మలతో కూడా భుజమూ భుజమూ రాసుకుంటూనే వున్నారు వారు.

కొత్తమతం పైకి లేవతీసింది వారిని.

దానికి సాయం, అదివరకే ముస్లిము లయి వుండిన హిందువులూ, అసలు ముస్లిములే అయినవారూ కూడా వారితో సంబంధబాంధవ్యాలు కల్పుకుంటున్నారు.

హిందువులుగా వుండినప్పుడు, బ్రాహ్మడు—క్షత్రియుడు—వైశ్యుడు — శూద్రుడు—చాకలి—మంగలి—మాల — మాదిగ—ఇలా వేరువేరయిపోయివుండినవా రందరూ యిస్లాం మతం పుచ్చుకోగానే వొక్కటే అయిపోయారు.

నవాబు, గరీబు—పాచ్ఛా, ఫకీరు—యీభేదా లేమయినా వున్నా యేమోగాని బతు కంతా వొకటే వారికి.

జాతి అంతా వొకటే.

మతం అంతా వొకటే.

చావుబతుకుల్లో కూడా భేదా ల్లేవు వారికి.

మరి, తమ సంగతి ?

మతం మార్చారే గాని పంచముల గూడేల్లోనే వుంచు తున్నారు మిషనరీలు తమర్ని.

ఊళ్లలో ప్రవేశపెట్టడం లేదు.

సవర్ణుల మధ్యకు మార్చడం లేదు.

వారితో కలపలేదు.

కలియనివ్వనూ లేదు.

మరి, మిషనరీలే తమతో ఐక్యం కాలేదు గదా, తమలో తమకు మాత్రం యెలా అబ్బుతుందీ ఆ యేకత ?

పైగా, మతం మట్టుకే యిచ్చారు గాని, మిషనరీలు తమకు బంధుత్వం యివ్వలేదు.

అసలు, వారు కూడా దూరంగానే వుంచుతున్నారు తమర్ని.

సహపంక్తి అయినా యివ్వడం లేదు.

బట్లర్లను చేశారు.

నౌకర్లను చేశారు.

చదువు చెప్పారు.

ఉద్యోగా లిచ్చారు.

అంతే.

"అక్కడే—అక్కడే" అంటూ దూరంగానే వుంచుతూ వస్తున్నారు తమర్ని, బ్రాహ్మలకంటే యెక్కువగా.

ఏం, యిదంతా యేమిటి ?

దీనికి తగిన ప్రత్యుత్తరం కనపడలే దతనికి.

పంతులు తండ్రికీ వొక ముస్లిముకీ బాగా స్నేహం.

ఆముస్లిం, తన తండ్రితో యెన్నోమాట్లు వాదించా డీసంగతి.

"రా, యిస్లాంమతం పుచ్చుకో" అని కూడా ఆహ్వానిస్తూ వచ్చాడు.

"నీజాతిని విడిచిపెట్టుకున్నావు. నీమతం విడిచిపెట్టుకున్నావు. కాని, నీఆదిజాతివారితోనే నీకు సంబంధం. నీఆదిమతంవారితోనే నీకిచ్చిపుచ్చుకోడాలు. నీకిప్పుడు జాతి లేదు తెలుసా ? కనక, రా, మాలో కలిసిపో. స్వేచ్ఛగా బతుకు" అనిన్నీ యెన్నో మాట్లు చెప్పాడా ముస్లిం తన తండ్రితో.

అదంతా యిప్పుడు జ్ఞాపకం వచ్చింది పంతులుకి

హిందువులు తనకి హైందవజాతీయత యివ్వలేదంటే, మరి మిషనరీలు మాత్రం యిచ్చారా తమ జాతీయత ?

తమ దొక కొత్తజాతి.

పునాది వుందా దానికి ?

జాతే మారదంటున్నారు కొందరు, మరి, కొత్తజాతి యెక్కణ్ణుంచి వస్తుందీ ?

ఎన్నోమాట్లు, ఎంతెంతగానో చర్చించుకున్నా డీదంతా పంతులు.

రాజకీయంగానే గాని ఆధ్యాత్మికంగా తమ కస్తిత్వం లేనట్టు కనపడిం దతనికి.

అనుబంధమే గాని ఆత్మీయత లేదు తమ కన్నట్టూన్నా అర్థం. అయిం దతనికి.

సవర్ణు లందరూ వొకరి యిళ్లకొకరు వెడతారు.

తురకలూ హిందువులూ కూడా వొకరియిళ్లకొకరు వెళతారు.

వరసలు పెట్టి పిలుచుకుంటారు.

కష్టసుఖాలు చెప్పుకుంటారు.

సలహాలు చెప్పుకుంటారు.

సాయం చేసుకుంటారు.

ఒకటే సంఘం అన్నట్టు మసులుకుంటారు.

మరి తమ సంగతి ?

ఒక్క పంచములతోనే తమ కలాంటి కలయిక.

ఊరంతా తమ నెవరో అన్నట్టు చూస్తుంది.

తామూ వూరివారి నలాగే చూస్తారు.

పోనీ అంటే, పంచములు తమ కాధిక్యమే యిస్తారు; కాని తమవా రన్నట్టు మాత్రం చూసుకోరు.

ఏదో భేదం వున్నట్టే చూస్తారు.

హిందువు లంటే తమకూ అలాంటి భేదమే కనపడుతుంది.

"మిషనరీల మన్నితం తమ కలాంటి ప్రత్యేకత కలిగిస్తోందా?" అనుకున్నాడు.

"మరి, తానిప్పు డేమిటీ చెయ్యడం ?" అని విమర్శించు కున్నాడు, చివరికి.

ఒకటే దారి.

మిషనరీల అడుగుజాడలే కనపడ్డాయి.

ఈపరిస్థితు లన్నీ వారితో చెప్పి చూశాడు కాకినాడ వెళ్లి.

"నీపని నువ్వు చూసుకో" అని మాత్రమే చెప్పి పంపేశారు వారతణ్ణి.

౪

సాయంత్రం అయిదుగంటలవేళ పెద్దమాదిగ లిద్దరూ, మతంలో కలిసిన వృద్ధు లిద్దరూ, పంతుల్ని వెంటమాత్రం పెట్టుకుని గ్రామ చావడిలో కూచుని వుండిన ముస్సబుకరణాలనూ, బ్రాహ్మణ ప్రముఖులనూ, కమ్మదొరలనూ సంబోధించి "మా మాట యేమాలోచించారండీ ?" అనడిగారు.

ఇది విని చావడిలో వున్న వారందరూ చకితు లయిపోయారు.

కొందరు కనుబొమ లెగరవేసుకున్నారు.

కొందరు తల లెగరనేసుకున్నారు.

"హారిః ఓ" మ్మన్నాడు యాజులు, కరణంకేసి చూస్తూ.

మొత్తానికి మౌనంతాల్చా రందరూ.

అది చూసి "అల్లా కటాక్షించిన మంచినీళ్లు తీస్కోడానికి వీళ్ల హుకుం యెవడిక్కావాలా, మాదిగల్ని పెద్దచెరువులో దిగించవయ్యా" అన్నాడు కరీము, జనాంతికంగా పంతులుతో.

"మాట్లాడ రేమండీ కామందులు ?" అంటూ మళ్లీ రెట్టించారు మాదిగలు.

మాట్లాడ్డాని కయినా, మాట్లాడకపోడాని కయినా యిందులో యేముందీ ?" అన్నాడు కరణం, సంగతి తేల్చేస్తూ.

కాని "యీ రెండు రోజులనుంచీ యేమిచేస్తున్నారు రా ?" అనడిగాడు ముస్సబు.

"ఒకపూట వొకరూ, మరో పూట మరొకరూ పెద్దకులాల వారు పోస్తున్నా రండి మాకుండల్లో నీళ్లు"

"ఇంకేం ? అలవాటయిపోయింది. కనక, కాలవలు తెరిచి మళ్లీ చెరువుల్లో నీళ్లు నింపుకునేదాకా అలా పోనివ్వండి"

మాదిగ పెద్దలు మాట్లాడలేకపోయారు.

విస్సన్న అని గ్రామనౌకరు.

పాతికసంవత్సరాలవాడు.

చదువురాదు కాని చురుకయినవాడు.

తండ్రి చచ్చిపోగా, సంవత్సరం కిందటే నౌకరీలో ప్రవేశించాడు.

"చెయ్యలేమండి" అన్నాడతను, మొగం వంచుకుని.

"హదీ మాట" అన్నాడు కరిణం, జనాంతికంగా.

"చెయ్యలేరేం ? ఏంచేస్తారు మరి ?"

గుర్లురుముతూ యిలా అడిగాడు కరణం.

"అలా కాలంగడపడం మాకు సాగదండి. మీరే ఆలోచించి చెప్పండి" అని నిలవతీశాడు విస్సన్న.

"చెయ్యలేరుట. అబ్బో, ఉద్యోగస్థులకంటే యొక్కువ బింకంగా మాట్లాడుతున్నాడు విస్సిగాడు. మాదిగపల్లె బాధ్యత అంతా తనమీదే వుంది కామోసు" నన్నాడు మున్సబు కళ్లెర్రజేసి, తన గ్రామాధికారిహోదా పురస్కరించుకుని.

"మాదిగల బాధ్యత అంతా మరెవరు వహిస్తే మీకు నచ్చుతుం దండి?" అని మళ్లీ అడిగాడు విస్సన్న, టూకాయించి.

"ఎవరో యెందుకూ ? నువ్వే వహించరా. వహించి యేమి చేస్తావో నువ్వే చెయ్యి, చూతాం"

మున్సబిలా వురిమాటప్పటికి చావడిలో ప్రశంసలు రేగాయి.

కరీము చురుగ్గా చూశాడు విస్సన్న కేసి, కాని, చెయ్యి పట్టుకుని విస్సన్నని వెనక్కి లాగేసి "మేమేదో చెయ్యతలచుకుంటే యేలినవారి నడగడం యెందుకండి ?" అనడిగాడు వీరాస్వామి, తెలివిగా.

"ఛా, ఏంమాట హయ్యా హద్ ?" అన్నాడు కరీము, పంతులు కేసి చూస్తూ జనాంతికంగా.

"మరి, నువ్వెందుకు వచ్చిన ట్టిక్కడికి ?" అని తనని నిలేసి అడిగిన ట్టనిపించిం దీమాట పంతులుకి.

కాని, దిగమింగుకుని వూరుకున్నా డతను.

విస్సన్నకి మాత్రం పౌరుషం కెళ్లించింది.

"ఒక కులంపక్షంగా అడుగుతున్నాం మనం, బిచ్చంగా కాదు. సమానఫాయాకే యిక్కడ చెల్లుబడి" అన్నాడతను, వీరాస్వామితో మెల్లిగా.

"వచ్చిన రోష్టు రానేవచ్చింది. నీళ్లచుక్క ల్లేకుండా యెండీ, కుళ్లీ, చావడంకంటే, యిలాంటి సందర్భంలో బరిమీద యెదిరించి ప్రాణాలు విడవడమే మంచిది" అని కూడా అన్నాడతను, గంగులుతో.

ఊగిపోయాడు.

ఒక్క ఉరు కురికాడు ముందుకి.

"పెద్దచెరువులో దిగేస్తామండి, మానం మేము" అనేశాడు చావడి కేసి చూస్తూ, యెదురొమ్ము విరుచుకుని.

"అచ్చా మాట హది. ఇస్గాడూ మన్సీ" అన్నాడు కరీము, మీసంమీద చెయ్యి వేసుకుని, మళ్లీ జనాంతికంగా.

కాని, తక్కినమాదిగలు బెదురుచూపులు చూశారు.

పంతులు మొగం మాత్రం జేవురించింది.

చావడిలో వున్నవా రందరూ మొగమొగాలు చూసు కున్నారు.

"ఇదంతా ఆ కిరస్తానీపంతులు చేస్తున్నా" డన్నా డొక కమ్మ దొర, పళ్లు బిగించి మెల్లిగా మున్సబుతో.

కిరస్తానీమతం వూళ్లో ప్రవేశించాక మాదిగలు తెనుగుమీరి పోతున్నా రని కమ్మవారి క్కొంచెం గుర్రుగానే వుంది.

"ఇప్పుడు కొంచెం బిగించామంటే, కిరస్తానీలను చులాగ్గా నాగనంపెయ్యవచ్చు" నన్నాడు యాజులు, మెల్లిగా, వెంకు పాదరితో.

"కిరస్తానీపిలకడు అణకువగానే మాట్లాడుతున్నాడు, హిందూ విస్సిగాణ్ణే చూడండి ఎంత పొగరో వాడికి?" అన్నా డొక అవధాని యాజులుతో.

కొద్దిగానో గొప్పగానో చావడిలో అందరూ కొంచెం కరు గ్గానే చూశారు.

పంతులుచూ పంతా అలే వుంది,

"వల్లకాదు. మీ తండ్రులనాడు—మీ తాతలనాడు— మీ ముత్తాతలనాడు—ఎప్పు డయినా వుందా ఆపద్ధతి?" అంటూ వురిమాడు కరణం.

"పెద్దచెరువులో దిగుతాడ ట విస్సిగాడు. ఏం, ఆడది యేలు తోందా?" అనడిగాడు మున్సబు.

"ఎందుకూ, నేనే కిరస్తాని నయి వుంటే, యెన్నడో పెద్ద చెరువులో దిగివుండకపోదునా?" అని యెదురడిగాడు విస్సన్న.

కరీము మెప్పుగా చూశాడు కళ్లుతిప్పుకుంటూనూ, తల మొగర వేసుకుంటూనూ.

"నీపని నువ్వు చేసుకో. వెళ్లు అని పంపేశారు మిషనరీలు పంతుల్ని. ఆమాట యిప్పుడు బందం అన్నట్టనిపించింది పాపం అతనికి.

"వోస్! తక్కిన కిరస్తానీలకంటే బాగ్దున మాణిక్యంలో పుట్టుకువచ్చావు నువ్వు మహా" అన్నాడు మున్సబు.

"చూస్తావే మయ్యా?" అనడిగాడు కరీము పంతుల్ని.

పంతులు తల తిరిగిపోయింది.

"వోరేయ్, విస్సిగా" అంటూ పిలిచాడు కరణం, కొంచెం కరుగ్గా.

"నాకళ్లముందు పుట్టావు నువ్వు. వూరిపెద్దల నందరినీ మోది చెస్తున్నావు. నువ్వు గ్రామనౌకరువి, జ్ఞాపకం వుందా?" అని కూడా అడిగా డతనలాగే.

"నీళ్లు లేక నాలుక పిడచకట్టుకుపోయి చావడానికా యిచ్చారు సర్కారువారు నాకు నౌకరీ?"

"నీళ్లు సంపాదించుకునే మార్గం యిదా?"

"మరేదో చూపించండి"

ఫిరంగి గుళ్లల్లా వెడుతున్నాయి మాటలు.

చావడీలో అందరికీ పొగలు కమ్ముకుంటున్నాయి కళ్లకి.

పాణికిపోతూడు గంగులు.

సర్వనాశనం మీదపడిపోతుం దన్నట్టు తోచిం దతనికి.

"పోనీ, మా చెరువుకు సగం అయినా నీరు విడిచిపెట్టండి" అన్నాడతను, కరణంకేసి తిరిగి, చేతులు జోడించుకుని.

"ఛూ, ఛూ, మాటకి హద్దంవచ్చావ్ నువ్వు, ఏం మనిసి నువ్వా ఘంగులూ" అంటూ చెండుకున్నాడు అపహాసించి కరీము.

అందుకే విస్సన్న పులుకూపులుకూ చూడగా "అదీ వల్ల కాదు. ఉన్ననీరంతా మీకిచ్చేసి బురద తాగమా మేము?" అని కస్సుమన్నాడు యాజులు.

"మరి మేము?" అంటూ టూకాయించాడు విస్సన్న, అంతకంటే కస్సుమంటూ.

"ఆమాట దేవుడి కొడుకు నడుగు" అన్నా డొక చౌదరి, మున్సబు అంగీకారం అర్ధిస్తున్నట్టు చూస్తూ.

పంతులు విరగబడిచూశాడు.

అరికాలిమంట నెత్తి కెక్కింది విస్సన్నకి.

"అయితే, నే నెవర్నో తెలుసా మీకు?" అనడిగా డతను, యెదురొమ్ము విరుచుకుని, తర్జనితో తనని నిర్దేశించుకుంటూ.

"తెలుసు పోవోయ్, పక్షీ!"

"పోతా తొందరపడకండి"

కరీము మెప్పుగా చూశాడు.

మళ్లీ వొణికిపోయాడు గంగులు.

విస్సన్నకేసి కంగారుగా చూస్తూ చావడికేసి చేతులు జోడించుకున్నా డతను.

వెంటనే వొక చౌద రందుకున్నా డరుగు దిగి.

"ఒరే, వీరడూ, తగువు పెంచుకోవా లంటే క్షణం. మీరే మహా మొనగా ళ్లనుకోకండి. కాని, యీవూ రెప్పుడు పుట్టిందో, మీకూ మాకూ తగువులు పుట్టాయా యీగడ్డమీద వొక్కమా టయినా?" అని కూడా అడిగా డతను, న్యాయ బారి చూస్తూ.

"ఆమాటకి వస్తే, మంచినీళ్లకోసం యెన్నడయినా మేమిన్ని పాట్లు పడవలసివచ్చిందా దొరగారూ?" అనడిగాడు వీరా స్వామి.

"నిజమే; కాని పేచీలు పడితే పాట్లు తప్పుతాయా?"

"పేచీ లంటే యిష్టం లేకేకాదూ మీకాళ్లదగ్గిరికి వచ్చి మాకు గతి చూపించమని మిమ్మ ల్నడగడం?"

"అది బాగుంది. మాకూ మీకూ కూడా అపాయం లేని వుపాయం——"

"చెప్పండి" అన్నాడు విస్సన్న, మాట సగంలో అందుకుని.

"అలా దారికి వచ్చావు బాగుంది" అంటూ మెచ్చుకున్నాడు చౌదరి, ముందు.

"ఎవరికీ యిబ్బంది లేకుండా యీవేసవి వెళ్లిపోవా లంటే, యిదివరకి నడిచిందే దారి. అయితే, పొద్దస్తమానమూ మీ కందరికీ నీళ్లు పోస్తూ కూచోడాని కెవరికి తీరుతుందీ? కనక, యిద్దరు మనుష్యులను రాయితీగా కుదురుస్తా న్నేను, జీతం యిచ్చుకోండి మీరు" అన్నా డతను, చాలా సౌమ్యంగా.

"దేవు డిచ్చిన నీరు మీరూరికే వాడుకోడమూ, మేము డబ్బుపెట్టి కొనుక్కోడమూనాండి?" అనడిగాడు గంగులు, నిరాశగా చూస్తూ.

"లేకపోతే పురందర్ని మాడిపొమ్మంటావా ?"

గంగు లేదో అనబోయాడు.

ఒక్కగంతు వేసి ముందుకు వచ్చి, వొక చేత్తో గంగుల్ని నిషేధిస్తూ "మరి, మమ్మల్ని మాడిపొమ్మంటారా మీరు ?" అనడిగాడు నిష్ఠురంగా విస్సన్న.

చౌదరి మాట్లాడలేకపోయాడు.

"మమ్మల్ని మినహాయించా పురందర్ని లెక్కచూసు కుంటున్నారు మీరు దొరగారూ ?" అనడిగాడు, వీరాస్వామి, చావడిలో వారి నందరినీ చూస్తూ

"పోనీ, నువ్వు చెప్పరాదూ వుపాయం ?"

"మీరే ఆలోచించండి కామందులు"

"బాగా ఆలోచించే చెప్పానురా నేను" అన్నాడు చౌదరి.

"నిజానికి కాలోచించడాని కేమీ లేదురా యిందులో, వొట్టి వడ్లగింజలో బియ్యపు గింజరా" అని కూడా అన్నాడతను.

"మేము లేకపోతే మీకొక్కదినం గడవదు"

"అదిగో, అదే, మీకున్న బెట్టుసరి. అదే చేస్తోం దీగడబిడ అంతా. అయితే, మేము లేకపోయినా మీకేమీ దిగడిపోదు, కదూ ?"

వీరాస్వామి మళ్లీ నిరుత్తరు డయినాడు.

"యుక్తుల్ హెందుకయ్యా ?" అనడిగాడు కరీము పంతుల్ని, జనాంతికంగా.

కోడితాచు పడగవిప్పేటట్టు తలపై కెత్తుకుని కోరచూపులు చూశాడు విస్సన్న చౌదరి కేసి.

అంతవరకూ దుడ్డుకర్రతో నేలమీద పొడుస్తూ, కాలి బొటనవేలితో నేలరాస్తూ మొగం వంచుకుని వున్నా డతను.

చూశాడు చూశాడు, చావడిలో వెనకవుండినవాడల్లా ముందుకి వచ్చి "ఇదేం శాశ్వతమా? ఈమాత్రందానికి తర తరాలుండిపోయేటట్టు కావేషాలు పెంచుకోడం తెలివయిన పనా? నాలుగేళ్లనాడేం జరిగింది? వోట్లయజ్ఞం అడావుడిలో పడి సమయం దాటబెట్టుకుని, మళ్లీ కాలవలు తెరిచేదాకా మీరూ మేమూ కూడా పసరెక్కిపోయిన నీళ్లు తాగలేదూ కళ్లు మూసుకుని? వస్తూ వుంటాయి చిక్కులు. అప్పుడే నాలుగు రోజులు గడిచేపోయాయి. ఇప్పటిమట్టుకి మీకొంపల్లో వొక చెలమ తీసుకోండిరా" అంటూ చక్కట్లు దిద్దా డొక శాస్త్రి.

"అవునవును, అది బాగుంది. ఇంతకీ,—పాదిరీదొరలు నుయ్యి కట్టించిపెట్టరాదూమీకు? ఊరికే మతంలో కలుపుకో గానే తీరిందా?" అనడిగాడు చౌదరి, దానిమీద.

"ఎక్కణ్ణుంచో వచ్చిన పాదిరీలకు పడుతుందా బాబయ్యా, మాగోడు?" అనడిగాడు వీరాస్వామి.

"అయితే, యెన్నియుగాలనుంచో వుండిన మతం యెందుకు విడిచిపెట్టావురా నువ్వు?"

వీరాస్వామి మరోమాటున్నా నిరుత్తరు డయినాడు.

దీనిమీద రోషం కెళ్లించింది పంతులుకి?

"ఇందాకణ్ణుంచి చూస్తాను, మామతం సంగతి మీకెందు కండీ?" అనడిగా డతను, కచ్చితంగా.

"అయితే, మావూరి సంగతి నీకెందుకూ ?" అంటూ నిలవ తీశాడు శాస్త్రి.

"అసలు నువ్విక్కడి కెందుకు వచ్చావ్ ?" అని గద్దించా డొక కమ్మయువకుడు.

"అలా అడగం" డన్నా డొక యువకుడు.

"ఇస్కూలు నేలమట్టం చెయ్యా లంటే యిదే సమయం" అన్నాడు మరొకడు.

"ముందు క్రాపింగులు గొరిగించెయ్యా" లన్నాడు వృద్ధు డొకడు.

తలోమాటా అన్నా రింకా యెందరో.

ఇవన్నీ పంతులు చెవిని పడ్డాయి.

అతని తల మళ్లీ తిరిగిపోయింది.

సరళమైన అతని కంఠ స్వరం కర్కశం అయింది, దాంతో,

"ఏమంటా ?" రనడిగా డతను.

"మీరే చెప్పండి" అన్నాడు గంగులు.

"గాజీ కుదరదు"

"కనపడుతూనే వుంది"

"ఇక మనతప్పు లేదు, రండి"

ఒక్క క్షణం ఆలోచించి "ఏం బాబయ్యా, ఏం సెలవ్ ?" అనడిగాడు గంగులు, చివరిమాటగా.

"నాలుగురోజులు కళ్లు మూసుకుంటే గడిచిపోయేదానికి రచ్చ నక్కా రేమిట్రా ?" అకేకడిగాడు చౌదరి.

ఊపిరి బిగపట్టుకుంటూ చూశాడు పంతులు.

"ఇక యెందు కయినా తయారే" అన్నట్లు తలలూపు తూంటూ మాదిగలు దారితీశారు.

విస్సన్న కేసి చూస్తూ నిస్సారంగా పెదవి విరిచాడు కరీము.

చురుక్కు మంది విస్సన్నకి.

కళ్లు మూసుకుని అడుగువేశా డతను.

*          *          *

"అగ్గి రవిలింది" అన్నా డొక బ్రాహ్మడు, మాదిగలు వెళ్లిపోయాక.

"మాదిగలు మాత్రమే అయితే మన కేమీ యిబ్బంది లేక పోవును. కిరస్తానీలు కూడా వున్నారు, మరి, చిక్కే" అన్నాడు మరో బ్రాహ్మడు.

"మన కాభయం అక్కర్లేదు. ఫాదిరీ లిలాంటివాటిలో కలగజేసుకోరు" అన్నాడు కరణం.

"కలగజేసుకుంటారే అను. అయితే, మాత్రం మనం లొంగి పోవలసిందేనా ?" అని యెదు రడిగాడు మున్సబు.

"ఏమి చెబుతావు చౌదరీ ? మాట్లాడవేం ?" అనడిగా డప్పు డొక బ్రాహ్మడు.

"ఏం చెప్ప మంటారూ ?" అని యెదు రడిగాడు చౌదరి.

"మాదిగలు పాలికాపుతనం మానేస్తా రనుకో"

"అది మీరూ అనుకోవలసిందేగా ?"

"మాకూ మీకూ భేదం లేదూ ?"

"రాత్రిళ్లు మీరు మండపేట బయలుదేరితే తోట్లిలో కూచుని మీ బండి తోలేవాడు మీ మాదిగపాలికాపే కాదూ?"

"ఊరుకోం డూరుకోండి" అంటూ అందుకున్నాడు కరణం, అవవ్యధానంగా.

"ఇదిగో, యిదే, మనదగ్గిర వున్న జబ్బు. ఒకళ్ల నొకళ్లం దెప్పుకుంటూ వున్నంతకాలమూ మన గతి యింతే" అనిన్నీ మందలించా డతను.

దానిమీద యాజు లందుకున్నాడు.

"తగువులే వస్తే అందు కందరూ సిద్ధమే. అన్నీ వుపాయాలే; కాని అసలు సంగతి మీరెవరూ గుర్తించడం లేదు. సాహసించి మాదిగలు పెద్దచెరువులో దిగితే యేమిటీ చెయ్యడం ?" అన డిగా డతను, గట్టిగా.

"అవు" నంటే "అవు" నన్నారు నలుగురూ.

పెద్ద లందరూ ఆలోచించారు.

రాత్రీ పగలూ కూడా పెద్దచెరువు పవిత్రత కాపాడుతూ వుండడానికి "ఉచితజీతాలతో" నలుగురు యువకులను నియమించాలని నిశ్చయించుకున్నారు.

అందులో వొక యువకుడు "బ్రాహ్మ డయి వుండా" లను కున్నారు.

ఒకడు "కమ్మ అయి వుండా" లనుకున్నారు.

"ఒకన్ణి కమ్మవారూ, బ్రాహ్మలూ సమిష్టిగా నిర్ణయించా" లనుకున్నారు.

ఒకణ్ణి "కరణం నామినేటు చెయ్యా" లనుకున్నారు.

ఆయువకులకు జీతాలు ఊరుమ్మడిసొమ్ములోంచి యివ్వ డాని కందరూ అంగీకరించారు.

౫

గంపెడాశతో తాలూకాకు వెళ్లి, పంతులు, సంగతంతా చెప్పి "సాయం చెయ్య" మని ప్రార్థించగా "హాఁ, హాఁ, బంగారు అవకాశం" అంటూ ఎగిసి కూచుని అందుకున్నాడు తాలూకా కాంగ్రెస్సు సంఘాధ్యక్షుడు.

"నిజంగా యిలాంటి సంఘటనలే మాకు పరపతి హెచ్చించేవి. బ్రాహ్మణప్రాబల్యంతో కుళ్లిపోతున్న కుగ్రామాల్లో యిలాంటి క్లిష్టసమస్య లెప్పుడు తలచూపుతాయా అని యెదురు చూస్తున్నా నేను, రెండుమాసాలనుంచి. నాకీ పదవి రావడంతోనే మీకిలాంటి చిక్కు రావడం నాఅదృష్టం. మీ గ్రామం ఆంధ్రదేశాని కంతకీ నడిగడ్డ అయిపోతుం దిక చూసుకోండి. ఆపోతుగడ్డమీదే యీవిషయం పరిష్కారం అయిం దంటే, ఆంధ్రహరిజనులకు స్వరాజ్యం సిద్ధించిం దన్నమాటే. దీంతో, తక్కిన ప్రాంతాల్లో వున్న హరిజనులకు గొప్పబలం చేకూరుతుంది. తక్కిన ప్రాంతాల సవర్ణులకున్నూ గొప్ప కనువిప్పున్నూ కలుగుతుంది. అయితే, యిది స్వల్పవిషయం అని మీరు భావిస్తున్నా రేమో ? మనలో వున్న జబ్బే యిది. బ్రిటిషుసామ్రాజ్యవాదుల నొక్క వూపు వూపే మహాగడ్డుసమస్య యిది. ఇదే యేగుజరాతీవాడో యేబెంగాలీవాడో అయితే అఖండ్ హిందూస్థాన్ సమస్య చేసి విడిచిపెడతాడు. ఇప్పు డయినా మీరేమీ కించపడనక్కరలేదు. అఖిలాఫ్రికాఖండంలో పాతుకుపోయివున్న రంగుభేదసమస్యను టుప్పున యెగరగొట్టివేసే విషమసమస్యగా మార్చేస్తాను చూసుకోండి నే నిది. నాలో వున్న ప్రత్యేకత

మీారెరగరు. కాలవలు కట్టేసి — సొంతచెరువు ఎండిపోయి— కనీసం వర్షనుయ్యి అయినా లేక — తాగడానికి మంచినీటిచుక్క లేని హరిజనసోదరులకు, చెయ్యిచాపితే అందేటట్టుసముద్రంఅంత సవర్ణుల చెరువు పక్కనే వుండగా అందులో దిగడానికిహక్కు లేదూ? చాలా దారుణం యిది. మిక్కిలీ ఘోరంయిది. చెప్పరాని అమానుషం యిది. సిగ్గుతో కుంగిపోతున్నాన్నేను విచారంలో మగ్గిపోతున్నాన్నేను కాని బెంగవద్దు మీాకు. కాంగ్రెస్సే మనకందరికీ అండ. అందులో హరిజనులకే అగ్రపీఠం యిప్పుడు. దానికి మీా గ్రామంలో వున్న బ్రాహ్మలొక లెక్కా పత్రమా ? అయితే, వొకటుంది. ముందు మీారూ మీావూరిహరిజనులూ అందరూ కాంగ్రెస్సులో చేరండి. అరవై డెబ్భయి కుటుంబా లంటున్నారు మీారు హరిజనులవి. వారిలో నూరుగురు కాంగ్రెస్సులో చేరడం అతిసులభం. ఇదిగో రశీదు బుక్కు. ఇది పూర్తిచెయ్యండి. ఇక్కడ కూచుని పూర్తిచేసినా చెయ్యవచ్చు మీారు. పాతిక రూపాయలు మాత్రం నాచేతి కిచ్చెయ్యండి మీారు. మీా బాధ్యత యెంత గొప్పదో మా నియమాలూ అంత గొప్పవే. కాంగ్రెస్సులో చేరనివారి విషయమై పనిచెయ్యడం మాకెలా వీలు మరి ? ఇదిగో, మీాసంగతి జిల్లా సంఘానికి రాసేస్తాన్నేను. అది రాష్ట్రసంఘానికి రాసేస్తుంది నాకంటే త్వరగా. ఉత్తరక్షణంలో ముప్ఫయిమూడుకోట్ల దేవతలూ మీావూళ్లో వాలిపోతారు తెలుసా ? అదృష్టం అంటే మీాదే. భాగ్యం అన్నా మీాదే. మీాఫొటో పత్రికల్లో పడా లంటే మీాకు మరో దారేదీ ? మరి ఆలస్యం యెందుకూ ? అమ్మమ్మా, చూస్తూ

వూరుకోవలసిన విషయమా యిది? ఇది పరిష్కారం అయే దాకా నేను భోజనం చేస్తానా నిద్రపోతానా?"

పంతులు చెవులు గింగురుమన్నాయి.

క్రాంగెస్సు సంఘాధ్యక్షుని ఆవేశమూ పరవళ్లూ చూశాటప్పటికి అతనికి చూపులున్నూ చెదిరిపోయాయి.

౬

కాళ్లీడ్చుకుంటూ వెళ్లి వూళ్లో జరుగుతున్న సంగతులన్నీ చెప్పి హరిజనసేవకసంఘాధ్యక్షుణ్ణి కూడా కోరాడు పంతులు, సాయం చెయ్యమని.

మీరలా ప్రార్థిస్తా రేమిటండీ, ఇలా చెయ్యి అని ఆజ్ఞాపించక?" అంటూ ప్రారంభించా డాత్యాగమూర్తి.

"నేను హరిజనులకోసం పుట్టాను. హరిజనులకోసమే పెరిగాను. చివరి కీశరీరం హరిజనుల పాదాలకిందే మట్టి అయిపోతుంది. ఇది నా అదృష్టం. పూర్వజన్మంలో నేను చేసుకున్న సుకృతాని కిది ఫలితం. ఇందుకు చాలా గర్విస్తున్నా న్నేను. ఇది గుర్తించలేనివా ళ్లేవ రేమనుకున్నా నేను గమనించను. ఈశ్వరాదేశం నేను చక్కగా గుర్తించగలను. అది గుర్తించాను కనకనే దొమ్ములాడి నేనీ పదవి సంపాదించుకున్నాను. నే నెన్నో మాట్లు జెయిలుకి వెళ్లాను. వెళ్లినప్పు డల్లా యెంతెంతో తపస్సు చేశా న్నేను జెయిళ్లలో. అది సిద్ధించింది నాకు పూర్తిగా. కాని యీసంగతి వారితోనూ వీరితోనూ నేను చెప్పుకోను. ఆత్మస్తుతి చాలాతప్పు. నేను చేసే పనులే గాని, నా స్వవిషయం వొకరి కెందుకు తెలియాలి?

మరి, ప్రకృతం. అసలీ హరిజనసమస్య యెందుకు వచ్చిందీ? బ్రిటిషుసామ్రాజ్యవాదులు సృష్టించారిది. నీళ్లు పోసిపోసి పెంచారు వారిది. అంతవరకూ ఆధ్యాత్మిక మైన మన హిందూ జాతి యెలాంటి తగువులూ లేకుండా ధృవతార లాగ వెలిగింది. ఎవళ్లు చేసుకున్నది వాళ్లు మనుభవిస్తూ యెవళ్లమానాన వాళ్లం బతికాం మనం. బ్రిటిషువారే మనలో కల్లోలాలు రేకెత్తించారు. లేకపోతే, హరిజనులు, సవర్ణులమీద తిరగబడి "మా మాట యేమి చెప్పా" రని యెన్నడయినా అడిగారా? కాంగ్రెస్సది గుర్తించింది. ఆదర్శదనారాయణుడు హరిజనసమస్యే తన జీవితసమస్యగా స్థిరపరచుకున్నాడు. దాని ఫలితమే యీహరిజన సేవకసంఘం. మీరు బాగా అర్థంచేసుకోవాలి. మీరు బాగా అవగాహన చేసుకోవాలి. మీరిది పూర్తిగా మనస్సుకి పట్టించుకోవాలి.

అయితే,—హరిజనసేవకసంఘం అంటే యేమిటి? హరిజనులైన మీకందరికీ సేవలు చెయ్యడానికి కంకణం కట్టుకున్న నావంటి త్యాగధనుల—తపస్సంపన్నుల కూటం అన్నమాట. ఎంత గొప్ప సంస్థో గుర్తించారా యిది? ఇలాంటి సంస్థ నిర్మించడం ఎంత గొప్పో తెలుసుకున్నారు. ఇలాంటి సంస్థను నడిపించడం యెంత కష్టమో వూహించారా? హరిజనుల నుద్ధరించడం అంటే పైపైని లే దండోయ్! దేశంలో, మొన్నటిదాకా, అక్కడక్కడ యేకొందరో యేస్వల్పమో అస్పృశ్యులకోసం పని చేసివుండడం నిజమే; కాని వారి కిదే పనా? వారి శ్రద్ధ అంతా దీనికోసమే వినియోగపడిందా? ఏదో మెప్పుకోసం—

ఏవో బిరుదులకోసం—ఎంతెంతో ఫిరాళ్లా లార్జించడంకోసం చేసి వుంటారు వారీపని. మరి, మేము? మాకిదే పని. మా సంసారా లేమయిపోయినా మాకిబ్బంది లేదు. మా గాలితెరబడి యిల్లూ వాకిలీ విడిచిపెట్టేసి వుంటాం మేము. మీరింకోటి కూడా గమనించాలి. నన్ను సాయం చెయ్యమని సవినయంగా ప్రార్థిస్తున్నారు మీరు. వేడుకొంటున్నారు. ఎందుచేతో తెలుసా? అదే మా విశిష్టత. అదే మా దగ్గిర వున్న ఘనత. నేను ఢంకామీద దెబ్బకొట్టి అడుగుతున్నాను. కష్టం వచ్చినప్పుడు హరిజనులకు కనిపించే దెవరు? మేము కామూ? ఈ విశాలవిశ్వంలో అనంత హరిజనులకు ఏకైక ఆధారం మేము కాదూ? మా వుద్దేశాలూ మా పనులూ యెంతెంత గొప్పవో ముందుముందు మీకింకా బోధపడతాయి.

"హరిజనులు" అన్న కొత్తపేరు సృష్టించడంవల్ల మీ ప్రత్యేకత బాగా స్థిరపడిపోయింది తెలుసా మీకు? ఇలా కాక,— వర్ణభేదాలూ, మతభేదాలూ తొలగించడానికే ప్రయత్నించి వుంటే, యీ విశాలదేశంలో, యీ అఖండజాతిలో నామరూపాలుండునా మీకు? అంతకంటే మీ జాతికి చేసే అపకారం, దుష్ప్రయత్నం మరేమి వుంటుందీ?

హరిజనసేవకసంఘాలమీద ప్రాజాపత్యం తమ చేతిలోనే వుండాలని కోరుతున్నారు మీ వాళ్లు కొందరు నాకు తెలుసు. ఇది వారి స్వబుద్ధికి పుట్టింది కాదు. చెప్పుడు మాటలు విని చేస్తున్న ఆందోళన అది, క్రైస్తవమిషనరీలు తమ అధికారం వొదులుకున్నారా? వారు సర్వమూ మన దేశీయ క్రైస్తవుల

చేతుల్లో పెట్టారా? అలాగే మేమున్నూ. ఇందులో వున్న నిగూఢరహస్యం యేమిటో తెలుసుకుందా మని ప్రయత్నించారా మీ రెప్పుడయినా? హరిజనుల కేమి టేమిటో కష్టాలు కలుగుతూ వుండాలి. వాటిని తొలగించి, ఆవిధంగా వారిని సేవించుకోడానికి మావంటి సవర్ణుల కెప్పుడూ గొప్పగొప్ప అవకాశాలు లభిస్తూ వుండాలి. దీనివల్ల జరిగే దేమిటో యోచించారా? అటు మీకు కష్టనివారణ యిటు సవర్ణులకు సేవాభాగ్యం. ఇది యెంతటి జటిల మైన నిర్మాణమో యిప్పటికయినా గుర్తుకి వచ్చిందా మీకు?

ఊళ్లలో ప్రవేశించి, మాయిళ్ల మధ్య యిళ్లు కట్టుకుని మీ అవస్థలు మీరు పడ్డం గొప్పా, మావంటి సవర్ణులు మీహరిజనవాడల్లోకి వచ్చి మీవీధులు తుడవడం గొప్పా? ఇది కూడా బాగా ఆలోచించాలి మీరు. నేనెరుగుదును, మీది సంకుచిత దృష్టి కాదు. అపార్థాలు చేసుకునే బుద్ధి కాదు మీది. సందేహాలు పెంచుకునే ఆత్మ కాదు మీది. అంచేతనే "త్వమేవ శరణం మమ" అన్న గీతావాక్యం మననం చేసుకుంటూ వచ్చి మీరు నన్నే ఆశ్రయించుకోగలిగారు. మీ తెలివి చాలా గొప్పది. మీదీక్ష నాకు పారవశ్యం కలిగిస్తోంది, మీవూరి హరిజనసోదరులకు తటస్థించిన చిక్కులకు నేను మిక్కిలి దుఃఖిస్తున్నాను.

కాంగ్రెస్సు దృష్టి అంతా యిప్పుడు హరిజనులమీదే వుంది. భగవంతుడు పరీక్షిస్తున్నాడా అన్నట్టు యిప్పుడే మీకీ చిక్కురానా? చాలా గొప్పగా (గ్రాండుగా) వుందీ సన్నివేశం.

అయితే, శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణు డేమి ఉద్బోధించాడూ? విపత్తులు వచ్చినప్పుడు చలించగూడదుట. అసలు విషయమూ విడిచిపెట్టుకోగూడ దన్నాడు. కనక, మీరు విశాలహృదయంతోనూ, విశ్వమానవసౌభ్రాత్రంతోనూ, లోకకళ్యాణదృష్టితోనూ యీసమస్యను సమన్వయించుకోవా లని కోరుతున్నాను. ఇది చాలా క్లిష్టసమయం. దీనికి సాయం, మీవూరి పరిస్థితులు వేరు. మీవూళ్లో మీకు కలిగిన కష్టాలే కనపడతాయి మీకు. మరి, మాకు? తాలూకాలో వున్న అన్ని వూళ్ల హరిజనుల కష్టాలూ మావే. మాదృష్టీ, మాశ్రద్ధా మీమీదా మీవొక్క వూరిమీదా మాత్రం కేంద్రీకరిస్తే—తన్మూలంగా తక్కిన వూళ్లు మరిచిపోతే మేము మావిధి తప్పినవాళ్లం అయిపోమూ?

ఏతావతా,— కాంగ్రెసు సాంఘికసమస్యాపరిష్కారం విషయం దూరంగా పెట్టి అసెంబ్లీయెన్నికల్లో వురికింది. మీ వూళ్లో డెబ్భయి వోట్లున్నాయి. అన్నీ అగ్రజాతులవారి చేతుల్లోనే వున్నాయి. మేమిప్పుడు మీకు సంబంధించిన యీస్వల్ప విషయమై కలగజేసుకుంటే విశ్వవ్యాప్తమైన అఖండ హిందూస్థానభవితవ్యానికి అపాయం సంభవించగలదు. కనక, మీరిప్పుడీసంకుచిదృష్టి విడిచిపెట్టాలి. ఏది యెప్పుడు, యెక్కడ, యెంత అగత్యమో అది ఆదరిద్రనారాయణునకు బాగా తెలుసు. వారి దృష్టి ఆకర్షించుకోగలిగా రంటే యిక మీకు తక్కు వేమిటి?

అందు కుపాయం యేమిటో తెలుసా? ఖద్దర్, ఖద్దర్. వెంటనే మీరు రాట్నం చేతబట్టాలి. విద్యావంతులైన మీరు కూడా యిలాగ విదేశీగుడ్డలు కట్టడం ధర్మమేనా? ఖద్ద రంటే

యేమిటో తెలుసా మీకు ? అటు మాంచెష్టరునగరం నేలమట్టం చేసిన మారణాస్త్రం కాదూ అదీ ? అహమ్మదాబాదునగరం నిత్యకల్యాణం పచ్చతోరణంగా చేసిన సంజీవి కాదూ అదీ ? కనక, మీరు వెళ్లి ఆకద్దరుకట్టి దయచెయ్యండి.

మన దురదృష్టంవల్ల మన దేశంలో యిన్నిభాషలు వెలిశాయి. మనపూర్వులు సామాన్యులు కారే అనుకోండి, కాని యీలోటు కనిపెట్టజాలిన వివేకం లేకపోయింది వారికి. ఈలోటు కనిపెట్టే, బ్రిటిషుసామ్రాజ్యవాదులు, యీవిశాల పవిత్రభూప్రదేశంలో తమ భాషను వ్యాపింపజేయ్యడానికి పూనుకున్నారు. కాని, కంఠంలో ప్రాణం వుండగా మనం అది జరగనిస్తామా? ఒకచేతో ఇంగ్లీషుని పారదోలాలి మనం. మరో చేత్తో యీప్రాంతీయభాషల నన్నిటినీ రూపుమాపుకోవాలి. మరోలాచేస్తూ మరే భాషా పోటీకి రాకుండా అడ్డుకుంటూ వుండాలి. మరో చేత్తో మన జాతీయ—మాతృ—భాషను వృద్ధిచేసుకోవాలి. ఇలాగ భాషావిషయమై చతుర్భుజులు మయి పనిచెయ్యాలి మనం.

ఇటు గాంధిగారి వుబలాటం తీరడానికీ, అటు యు. పి. వారి స్వభాషాభిమానం ధన్యం కావడానికీ తమ ప్రాంతీయభాషను అణచివేసుకున్నవారిలో—రూపుమాపుకున్నవారిలో—చంపేసుకున్నవారిలో మన ఆంధ్రులం మొదటివాళ్లం కావాలి. ఈ మాటలు నేను మీతో తెనుగులో చెప్పవలసివచ్చినందుకు చాలా సిగ్గుపడుతున్నాను.

కనక, మీరు వెంటనే హిందీ నేర్చుకోవాలి. మూడు మాసాల్లో వస్తుం దది. అంత సులభమైన భాష మరొకటి

ప్రపంచంలో లేదు. మీవూరి హరిజను లందరూ తమలో తాము సర్వవిషయాలూ ధారాళంగా హిందీలోనే యెప్పుడు మాట్లాడుకోగలుగుతారో అప్పుడే వారికి ముక్తి. తెలుగుభాష పూర్తిగా మరచిపోయినప్పుడే వారికి అగ్రజాతులవారితో సమానప్రతిపత్తి.

వీటి కన్నిటికీ పై మెట్టు గ్రామపునర్నిర్మాణం. అది చక్కగా వుండడంవల్లనే అఖండహిందూస్థాన్ ఆదికాలంలో చాలా గొప్పగా వుండగలిగింది. అది పూర్తిగా చెడిపోవడంవల్లనే మన కిప్పు డీ తీరని దాస్యం. ఇలాంటి స్థితిలో మీరిలాంటి స్వల్ప విషయాలకోసం తగువులు పెంచుక్కూర్చోడం బాగుందా ?

మీకు తత్వం బోధపడివుంటుం దీపాటికి. కనక, బాగా నిదానించండి. అఖండహిందూస్థానంలో వున్న యేడులక్షల గ్రామాల్లోనూ మీగ్రామం యేపాటిది ? అఖండహిందూస్థానంలో వున్న యేడుకోట్ల హరిజనుల్లోనూ మీవూరి డెబ్భయి కుటుంబాల హరిజనులూ వొక లెక్కా జమా? ఏవో వస్తూనూ వుంటాయి పోతూనూ వుంటాయి ప్రతీస్వల్పవిషయానికీ మీరిలాగ తగువులు పెంచడమే పనిగా పెట్టుకోడం యేమీ బాగా లేదు. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అన్నాడు శ్రీకృష్ణభగవానుడు. అదే మన కిప్పుడున్న సదుపదేశం. మీరు సకలమూ మరచిపోండి. సకలమూ విడిచిపెట్టండి. మీరిప్పుడు చెయ్యవలసిం దొక్కటే. అది కాంగ్రెస్సువారినే అసెంబ్లీకి పంపడం. మీరీపని చెయ్యగలిగా రంటే, అప్పుడు, మీస్థితి యెలా వుంటుందో వూహించుకున్నారా? చూడండి,—

ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సు సంఘాధ్యక్షపదవి మీవంటి హరిజన సోదరున కివ్వాలని నేను గట్టిగా వాదించబోతున్నాను. అగత్యం అయితే, ఆవిషయమై నేను నిరశనవ్రతం కూడా సాగించాలని నాఅంతరాత్మప్రబోధంకోసం యెదురుచూస్తున్నాను.

కనక, మీరిప్పుడు నాదీక్షకి భంగం కలిగించకండి. నా యేకాగ్రత భంగపరచకండి. ఏపోరంబోకుభూమిలోనైనా వొక చెలమ దీసుకుంటే కావలసినన్ని మంచినీళ్లు మీకు. మరి, దయ చెయ్యండి, బయలు దేరండి"

పంతులు తుళ్లిపడ్డాడు.

ఎఫిరీపోయాడు.

## 8

భోజనంచేసి రాత్రి యెనిమిదిగంటలవేళ ఆరుబయట పడకకుర్చీలో కూచుని వున్నాడు పంతులు.

అత నంటించిన చుట్ట సగం కాలాటప్పటికి మాదిగపెద్దలు వచ్చి చుట్టూ కూచున్నారు.

"తెల్లవారితే మరో రోజు గడిచిపోతుంది. కాని దారి తెన్నూ కనపడ్డంలేదు. పెద్దకులాలవారికీ మనకూ తగువు మాత్రం పెరిగిపోయింది" అంటూ ప్రారంభించాడు వీరాస్వామి

"నిజమే" అన్నాడు పంతులు. "అయితే, యెప్పటి కయినా మన కొక్కటే దారి. వారూ మనమూ యిష్టంగా వున్నంత కాలమూ మన కేమీ లాభం లేదు. "మీరే మాకాధారం" అని దేవుళ్లాడుతూ మనం వారిచుట్టూ తిరిగినంతకాలమూ మనకు చిక్కులూ తీరవు, ఇబ్బందులూ తొలగవు. మన స్థితి

కూడా వారికి బోధపడదు, "నువ్వా నేనా" అన్న పద్ధతిగానే మసులుకోవాలి మనం"

"కాలవలు తెరిచా రంటే—"

"ఇప్పు డిలా తగువు పెట్టుకున్నాం కనక, అప్పు డిక మన్నే మనకు" ఈలోపునే యేర్పాటు కావా లెందు కయినా రాజే"

"దీంతో పాటు కూలివిషయం కూడా—"

"అదే నేను చెబుతున్నది పిచ్చుకుంచాలు వెనక్కి పెట్టించాలి. జీతా లెక్కు వ చేయించుకోవాలి"

"మనం వారి పనులే మానేస్తే ?"

"మనమే చెడిపోతాం"

"ఏరాత్రో మనం పెద్దచెరువు నీరు కూడా కొట్టేస్తే ?"

"మన కీనీళ్లయినా యెలా వస్తాయీ ?"

"............"

"తురకలతో కూడా విరోధం రాదూ ?"

"............"

"కలపటం అంటే నాకు భయం అనుకోకండి. ఇవాళే కాదు, యుగయుగాలనుంచీ మన బతు కిలాగే వుంది. ఇంకో పద్దినాలా మనం భరించలేము ? నిదానించండి. మనం పెద్దచెరువులో దిగి తీరాలి. మనం యీపట్టుదల విడిచిపెట్టుకోగూడదు. చూస్తూ వుండండి, మంచి వుపాయం—"

"నాకు దొరికిం దండోయ్" అంటూ వచ్చాడు విస్సన్న, వగర్చుతుంటూ.

"ఏమి టా మంచివుపాయం ?" అనడిగాడు పంతులు.

"పరుగుపరుగున వచ్చాను డాయాసం తీర్చుకోనివ్వండి పాపం" అన్నాడు నరిసిమ్ములు.

"మంచినీళ్లు పుచ్చుకుంటావా?" అని మళ్లీ అడిగాడు పంతులు.

"మంచినీళ్లు కాదు నేను పుచ్చుకోడం, తురకమతం" అన్నాడు విస్సన్న, అప్పటికీ కొంచెం వగర్చుకుంటూనే.

"ఛా, ఛా, అదేంపనిరా?" అన్నారు పెద్దలు; కాని తొందర పడకం" డన్నాడు పంతులు.

పెద్దచెరువులో దిగి సావకాశంగా స్నానం చేసినంత వుత్సాహం కలిగిం దతనికి

నిజానికి, తాను, మాల వెంకడుగా వుండినప్పటికంటే బాగానే వుంది తన స్థితి యిప్పుడు.

చదువుకి చదువు—ఉద్యోగాని కుద్యోగం—డబ్బుకి డబ్బు—పలుకుబడికి పలుకుబడీ—గౌరవానికి గౌరవం—

కొందరయినా పెద్దకులాలవారు తనతో మర్యాదగా మాట్లాడతారు.

కాని, మతంలో కలిసినా వాళ్లలో కాపరం చెయ్యడానికి వీలు లేదు.

మరి, తురకమతంలో కలిస్తే?

బాగా ఆలోచించాడు పంతులు.

చివరి కొక్కమాటు తల పంకించుకుని "నీకే తోచిందా?" అనడిగాడతను.

"తాలూకాకాసుంచి వచ్చాటప్పుడు కరీముసాయిబగారు చెప్పారు"

"అందరూ కలవా లన్నారా ?"

"ఇష్టం వున్న వాళ్లు—మనిషి అనిపించుకోవా లనుకునే వాళ్లు మాత్రమే—"

"మంచిమాట" అన్నాడు గంగులు.

"కిరస్తానీమతంలో కలిసి నేనేమి బావుకున్నానూ ? చచ్చిపోయాక యేమయిపోతామో ? కాని మాదిగనయి నరకం అనుభవించాను. కిరస్తానీ నయాక ఆశలు మాత్రం రేగాయి" అనిన్నీ అన్నాడు.

"విస్సన్న తురకమతంలో కలిస్తే, అతని కల్గిగే స్వేచ్ఛ చూసి తక్కిన మాదిగలు కిరస్తానీమతం అంటే చులకనచేస్తారేమో యేమయినా ఆలోచించుకున్నావా ?" అని యెవరో అడిగిన ట్టయింది పంతులుకి.

ఒక్క నిమిషం తటపటాయించా డతను.

"అట్నుంచి నరుక్కువద్దాం" అనుకున్నాడు చివరికి.

"అందుకు నువ్వే మన్నా?" వనడిగాడు ఉండుండి విస్సన్నని.

"నామట్టుకి నేను సిద్ధం అన్నాను"

"మరి, కులం ?"

"కులంకోసం కులం విడిచిపెట్టేస్తాను"

"తక్కినవా ళ్లెవరూ కలవ రనుకో"

"వాళ్ల కర్మ మనీ అనుకుంటా న్నా కేం ?"

"ఏమండీ, విస్సన్న తురకమతంలో కలుస్తా డనుకోండి. అది చూసి పెద్దకులాలవారు పెద్దచెరువులో దిగనిస్తారా మాదిగలను?" అనడిగాడు నరిసిమ్ములు.

"దిగనిస్తారా ? దాని కెంత జ్ఞానం అబ్బాలి ? దాని అంత రార్థం యేమిటో తెలుసుకునే శక్తిలేదు పెద్దకులాలవారికి"

"మరి, విస్సన్న తురకల్లో కలిస్తే పెద్దకులాలవారికి నష్టమూ లేక, మనకి లాభమూ లేక___"

"మనకి అనకు"

"పోనీ మాకే అనండి"

"మీాదో పెద్దకులం అవుతుంది. అది కాదూ లాభం ?"

ఎందరో వచ్చి తనని పొదువుకున్నట్టనిపించింది నరిసిమ్ములుకి.

"అయితే, మేమంతా తురకలం అయిపోతే ?" అనడిగాడు భీముడు.

ఆలోచించాడు పంతులు.

"ముందు విస్సన్నని కలవనివ్వండి, చెబుతాను" అన్నాడు చివరికి.

"ఏమంటావు విస్సన్నా ?" అనడిగాడు వీరాస్వామి.

"మాట యిచ్చేశాను. కలవడం నిరుకే"

"ఎప్పుడు ?"

"ఇప్పుడు. ఈనిమిషాన. అంత తొందరగా వుంది నాకు"

"మతం పుచ్చుకోగానే పెద్దచెరువులో దిగేస్తావా ?" అనడిగాడు భీముడు.

"అందుకే గా మతం పుచ్చుకోడం ?"

"ఇది చూశారా పంతులుగారూ ?" అంటూ అందుకున్నాడు నారన్న.

"హిందూమతంలో పుట్టాను. నేను మరోమతంలో కలవడం అంటే యేమిటి ?" అనడిగాడతను, ముందు.

"శరీరం మారలేదు. బుద్ధి మారలేదు. ఆత్మ మారలేదు. వేషం మారుతుంది, అంతే—"

"ఏమతం అన్నా నువ్విలాగే మాట్టాడతావు పోవోయ్" అని నిరసిస్తూ మొగం పక్కకి తిప్పుకున్నాడు జగ్గన్న.

"నువ్వు పొమ్మంటే పోతానా నేను" అని నిలవతీశాడు నారన్న.

"నువ్వు పోవనుకో పెద్దకులాలవారు పొమ్మంటేనే మేము పోయాం, తెలుసా?" అని గద్దించాడు జగ్గన్న.

"పెద్దకులాలవారు పొమ్మనలేదు. అనడానికి వారి కధికారమూ లేదు. తమ సంగతే తమకు తెలియదు వారికి"

"నువ్వు చెప్పే దేమిటో విడమర్చి చెప్పు" అన్నాడు పంతులు.

"అదే చెబుతున్నాను. మాదిగ తమ పెద్ద చెరువులో దిగడానికి వల్లకాదు పెద్దకులాలవారికి. ఆమాదిగే మరో మతంలో కలిసివస్తేమాత్రం వారడ్డు పెట్టరు"

"అవును"

"కులం పెద్దది కావచ్చు వారిది. జ్ఞానం వుం దంటారా కొంచె మయినా?"

"లేదు"

"మరో మతంలో కలిసిన మాదిగ మాట చెప్పండి. అతని కబ్బిందా జ్ఞానం?"

"అబ్బడమూ అబ్బకపోడమూ అది వేరే సంగతి. మతం మారితే మాత్రం అబ్బడాని కవకాశం వుంది. ఏమంటావ్?"

"దణ్ణం" అన్నాడు నారన్న.

అటు చూసి యిటున్నూ చూసి "నారన్న చివరి కేమి చెప్పినట్టు పంతులుగారూ ?" అనడిగాడు గంగులు.

"పెద్దకులాలవారిదగ్గిర పెద్దతనం లేదు. ఉండవలసింది కూడా ఏమీ లేదు. అజ్ఞానం—మూర్ఖత్వం—అసూయ—ద్వేషం—కడుపుమంట— ఇవి మాత్రం దండిగా వున్నాయి. ఇదీ నారన్న చెప్పింది" అని బదులు చెప్పాడు పంతులు.

"కనకనే—వారితో కలిసివుండలేకే—మేము మతంలో కలిశాము. ఈమాట చెప్పండి నారన్నకి"

"నువ్వే చెప్పావు, మళ్లీ నేను కూడా చెప్పనక్కరలేదు వేరే"

"నే నొకటి చెబుతా" నన్నాడు విస్సన్న.

"చెప్పు" అన్నాడు పంతులు

"నేను విస్సన్నని. "మాదిగ" అంటున్నారు నన్నందరూ. కనక, నన్ను పెద్దచెరువు తాకనివ్వరు. తమ యింట్లోకి రానివ్వరు పెద్దకులాలవాడు. మరి, నేను మతంలో కలిశాక ?"

"కలిశాక ?"

"నేను గ్రామనౌకర్ని. కనక, కరీముసాయిబుగారితో పాటు, సర్కారుపనిమీద, మున్సబుకరణాల యిళ్లల్లోకి వెడతాను. కరీము సాయిబుగారితో పాటు పెద్దకులాలవారి యిళ్లన్నీ దూరేస్తాను. కరీము సాయిబుగారితో పాటు పెద్దచెరువులో స్నానం చేస్తాను"

"అప్పుడు నన్నెవరూ అడ్డపెట్టరు"

"అవును, అడ్డుపెట్టరు"

"అంటే, మారిందెవరు ? పెద్దకులాలవారా, నేనా ?"

ఇలా అడిగి విస్సన్న మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

చకితుడై పంతులుకేసి చూశాడు గంగులు.

"నేను మిమ్మల్నందరినీ కిరస్తానీమతంలో కలపడానికి వచ్చాను. మీలో వొకణ్ణి తురకమతంలో కలపమంటున్నాను. ఇది బోధపడ్డంలేదు నీకు. కదూ ?" అనడిగాడు పంతులు.

"అవు" నన్నాడు గంగులు.

"చెప్పవలసింది చాలా వుంది, రండి బడిలో కూచుందాం" అంటూ లేచాడు పంతులు.

పడకకుర్చీ మడిచి పుచ్చుకుని బయలుదేరాడు గంగులు.

నడుస్తూ నడుస్తూ "మరి, నీ పెళ్లాం మాట యేమిట్రా ?" అనడిగాడు నరిసిమ్ములు.

"నాపెళ్లామూ నాతోపాటే" అన్నాడు విస్సన్న.

ముందుకి వెడుతున్నవాడల్లా విరగబడి వెనక్కి చూస్తూ "అంటే, యేమిటో తెలుసా ? సమయం వస్తే, తెగలపేరు చెప్పుకునీ, కులాలపేరు చెప్పుకునీ, వర్ణాలపేరు చెప్పుకునీ, విశేషించి రాజకీయాల పేరుచెప్పుకునీ తమలో తాము కుమ్ములాడు తుంటారు పెద్దకులాలవారు. అది చాలడం లేదు వారికి. తమ జాతిని బద్దలుకొట్టుకుంటున్నారు వారు. తమ పోటీదారులను పెంచుకుంటున్నారు. తమ గోతులు తామే తవ్వుకుంటున్నారు కూడా" అన్నాడు పంతులు.

## ౮

"సలామ్ కర్ణం మహారాజ్ !"

"సలామ్ కర్ణం మహారాజ్ !"

గ్రామనౌకరు కరీమూ మరో సాయిబూ వచ్చి యిలా సలాములు చెయ్యగా. తానన్నా "సలాం, సలాం" అంటూ తలపూపి, చదువుతున్న వార్త పూర్తిచేసి, యిటు తిరిగి, చకితుడై "ఆ, ఆ, విస్సిగా అంటూ కుపితుడై గభీ మని లేచి కూచున్నాడు కరణం.

అప్పుడే భోజనం చేసి వచ్చి వాకట్లో గుడ్డకుర్చీలో వాలి వార్తాపత్రిక చదువుకుంటున్నా డతను.

వేదవేదాంగాలు నేర్చి పేరుపడ్డకుటుంబంలోవాడేమో, చేసేది లౌక్యం అయినా, వైదికసంప్రదాయం విడిచిపెట్టలేదు కనక, వేషభాషల్లో యెక్కువ మార్పులేక మహాపండితు డన్నట్టుంటా డతను.

బ్రహ్మవర్చస్సుకి తక్కువలే దతనిదగ్గిర.

ఉదయం అయేటప్పటికి స్నానసంధ్యాద్యనుష్ఠానా లన్నీ ముగించుకుని కచేరీగదిలో కూచున్నా డంటే, ఏదయినా అవాంతరం వస్తే తప్ప భోజనం అయేదాకా వీధిలోకి రా డతను.

మాదిగనౌకర్లతో మాటా ఆడడు.

ఇలాంటి సనాతనధర్మపరుని నట్టివాకిట్లో మాదిగవిస్సన్న.

వొళ్లు మండిపోయిం దతనికి.

వెంటనే "ఏమిరా నీపొగరు ?" అంటూ నిప్పులు కక్కుతూ లేచికూచున్నా డతను.

మామూలు స్థితిలో అయితే, ఆకళ్లు చూస్తే విస్సన్నే కాదు, కరీము కూడా పుంజాలు తెంపుకుని పారిపోవలసిందే; కాని విస్సన్న నిర్లక్ష్యంగా చూస్తూ నిటార్గా నుంచున్నా డప్పుడు.

కాని కరీము మాత్రం అందుకున్నాడు, పులుకూ పులుకూ చూస్తూ.

"అయ్యా, మీకీ యింకా అస్మంటీ మాటా పన్కీ-రాద్" అన్నాడు ముందు.

"యిస్సన్నా మొన్నటీకే బీబీతో కూడా యిస్లాం మతంలో కల్సిపోయాడ్ ! పేరూ "యిస్మాయిల్" ఆయ్యా మీకీ సలాం చెప్పీ వుండాడ్ కనక, ఆయనకీ మీకీ బదుల్ సలామ్ చెప్పవాలా వుందీ అండీ" అన్నాడు చివరికి.

"ఏమిటీ, ఏమిటీ ?" అన్నాడు కరణం.

అంటూనే ముడుచుకుపోయాడు కూడా.

బుద్ధి చెదిరిపోయియిం దతనికి

చైతన్యమే లోపించినట్టయిపోయింది కూడా.

ఈస్థితిలో యిస్మాయిలు ముందుకు వచ్చాడు.

"అయ్యా, మీరూ నేనూ కృతార్థులం అయిపోయాం. మాదిగతనం మీకే కాదు, నాకూ పనికివచ్చింది కాదు. అది విడిపించుకోడానికి నే నిస్లాం మతంలో కలిసిపోవలసివచ్చింది. నా అదృష్టంవల్ల, నేను, మీహిందూమతం విడిచిపెట్టిన వెంటనే వొక మనిషి నయినాను. ఇక ముందుమాట. మీరు నాపై అధికారులు. ఇంతే మీ ఆధిక్యం. ఈసంగతి బాగా గుర్తించుకుని మీరు ప్రవర్తిస్తిరా వుభయులకూ శ్రేయస్కరమే. లేకపోతే మాత్రం——" అంటూ మాట సగంలోనే ఆపుచేశాడు.

కరణం మాట్లాడలేకపోయాడు.

రెండుచేతులతోనూ మొగం కప్పేసుకున్నాడు.

"రామా, రామా" అనుకుంటూ వుండిపోయాడు కూడా.

"నిద్రా యేమిటోయ్?" అనడుగుతూ యీసమయాన యాజులు వచ్చాడు, ఇన్‌కమ్‌టాక్సునోటీసు చేతబట్టుకుని.

కరీముని యిస్మాయిల్ని వీధిగుమ్మంలోనుంచే చూశాడతను.

అయితే, యిద్దరూ తురకలే అనుకున్నాడు.

వారిలో వొకడు రూపాంతరమూ నామాంతరమూ పొందిన విస్సన్న అని గుర్తించలేకపోయాడు.

దగ్గిరికి వచ్చాకయినా అతని చూపులు కరణంమీదే వుండిపోయాయి.

ఇదంతా గుర్తిస్తూనే వున్న కరీము చిరునవ్వు నవ్వుకుంటూ కన్నుగీటాడు.

వెంటనే, అరుగుమీద వుండిన గుడ్డకుర్చీ తెచ్చి కరణానికి దగ్గిరగా వేసి, యాజులు ఆసనశుద్ధిగా కూచున్నాక "సలాం యాజుల్ మహారాజ్" అన్నాడు యిస్మాయిలు.

"అభీష్టసిద్ధి—" అంటూనే యాధాలాభంగా మొగమెత్తి చూశాటప్పటికి—తనకి కుర్చీ తెచ్చివేసినవాడు—అక్కడ కర్ర కుర్చీ లెన్నో వుండినా పనికట్టుకుని గుడ్డకుర్చీ తెచ్చివేసినవాడు విస్సన్న అని గుర్తుకి వచ్చింది.

కొయ్యయిపోయాడతను.

ఆకంగారులో కుర్చీ పక్కకి వాలిపోయింది.

కుడిచేత వుండిన నోటీ సొకవైపునా, యెడమచేతవుండిన పొడుంకాయ వొకవైపునా పడిపోగా, వెల్లకితలా పడిపోయి, వొక్క క్షణానికి తూల్తూతూల్తూ లేచి "వోరి మాదిగపీనుగా" అంటూ తిట్టుకుంటూ దూరంగా వెళ్లిపోయాడు యాజులు, దాంతో.

ఇదంతా వేళ్లసందుల్లోనుంచి చూస్తూనే వున్నాడు కరణం. ఎత్తుపడిపోయిన యేనుగులా లేచి కూచుంటూ నిట్టూర్పులు విడిచాడతను.

"ఈదురంతం యేమిటోయ్?" అనడిగాడు యాజులు.

"తురకల్లో కలిశాడు విస్సిగా" డన్నాడు కరణం.

"హాద్గో, హాద్గో" అంటూ చర్రు మన్నాడు కరీము దాని మీద.

"అస్మంటీ మాటా—మాకీ చెప్పామూ లేదూ? ఇస్ గాడూ నై నై. ఇస్‌గాడూ మర్గయా అనోండి. ఇస్మాయిల్ సాబ్ చెప్పండి. లేకపోతే తంటాల్. హాంతా మీకే యెర్గుదురు" అని కూడా అన్నాడు, తర్జనితో టోకాయిస్తూ.

"ఏమిటో యీ పుట్టిమునక?" అని మళ్లీ అడిగాడు యాజులు.

"మనకర్మం. రండి కూచోండి"

"ఛా, ఛా, తన్ని తగివెయ్యక, వాణ్ణింకా—"

"ఖబడ్దార్ యాజుల్ సాబ్!" అంటూ కస్సుమన్నాడు కరీము.

'మీకీ ముసల్మాన్ హువా. హిండ్రా—హింకా మీకీ—"

"కరీం, కరీం, వూరుకో వూరుకో" అన్నాడు కరణం.

"పెద్దల్ పిన్నల్ అంటే మాకీ వొప్పుకోదు మహారాజ్! పెద్దల్కీ- పిన్నల్కీ యొక్వా తక్వా చూపించుకోవాలా. ఘుస్కా-ఘుస్కా మాటల్ యిడ్సిపెడ్తే— హాదీ మంచిదీ లేదు. మాకీ ఘౌరవం కావాల. మీకీ ఘౌరవం చేస్తాం. బరాబర్" అని చాలా చురుగ్గా జవాబు చెప్పాడు కరీము.

ఇది యిలా జరుగుతూవుండగా యాజులు, యింటోకి వెళ్లి "దిక్కుమాలిన వుద్యోగాలకోసం యేడుస్తారు మనవాళ్లు. నీకొడుకు ఉద్యోగస్థుడు కావడంవల్లనేనా మాదిగవిస్సిగాడు నీనట్టింటోకి వచ్చాడూ?" అంటూ కరణం తల్లిగగ్గిర పరవళ్లు తొక్కాడు.

అరవై యేళ్లు దాటిన దావిడ.

పొత్తుపంచె కట్టుకుని వుంది

అప్పుడే భోజనంచేసి వచ్చి లక్షవర్తివ్రతంకోసం వొత్తులు చేసుకుంటోంది.

"ఆ,ఆ" అంటూ యెగిసిపడి లేచి నుంచుం దావిడ ముందు.

"ఏటీ యేవిమిటీ?" అని మళ్లీ అడిగింది, కంగారుగా

"మాదిగ విస్సిగాడమ్మా! నీయింటోకి వచ్చాడు. అడిగో నమ్మా నీకొడుకు దగ్గిర నుంచునివున్నాడు"

"అయ్యో, అయ్యో, అదేం పోయేకాలం?"

"నీకొడుక్కి వేసినట్టే నాక్కూడా గుడ్డకుర్చీ వేశాడమ్మా వాడు"

"ఓరి వాడిల్లు—మీరు కూచున్నారా?"

"కూచున్నాకే తెలిసిందమ్మా, వాడు—"

"అయ్యో, అయ్యో, మాదిగవాడు ముట్టుకున్న గుడ్డకుర్చీ మీద కూచుని—యజ్ఞంకూడా తగులడ్డ పెద్దమనిషివి కదా, నువ్వెందుకు వచ్చావయ్యా నా నట్టింట్లోకి ?"

బోసినోరు చప్పరించుకుంటూ వాణికిపోయింది ముసలమ్మ.

తెల్లపోయాడు, మొదట, యాజులు.

కొంతసేపటికి దిటవు తెచ్చుకున్నాడు.

"వాడు తురకమతంలో కలిసివచ్చాడు, ఫరవాలేదులే" అన్నాడు తరవాత, అప్పటికీ కంగారుగానే.

"అమ్మయ్యా" అని వూపిరితీసుకుంది ముసలమ్మ.

కాని "మాదిగాడు మాదిగా డంటూ హడలగొట్టావేం నన్ను మరి ?"

"మాట పూర్తిగా వినిపించుకోకుండా—"

"మీరు సగంసగమే యెందుకు—"

"మాట ప్రారంభించాటప్పటికే—"

"అలా యెందుకు—"

"నేను మాత్రం కంగారుపడిపోలేమా మరీ ?"

"రామస్మరణ చేసుకుంటూ వొత్తులు చేసుకుంటున్న దాన్ని హడలబెట్టి—ఏమన్న పెద్దమనిషి వయ్యా నువ్వు ?

"............."

"దీపాలపెట్టిస్తారు ఎవళ్లో రాజమహేంద్రవరంలో ? వాళ్ల దగ్గిర నీపెద్దకొడుకు గుమాస్తా ట. చాకలాడికంటే నీమొక్కువ మాత్రం యేమిటయ్యా ?"

యోజులు తెల్లపోయాడు.

మెల్లిగా జారుకున్నాడు కూడా అక్కణ్ణుంచి.

౯

ఉదయం పదకొండు.

బ్రాహ్మణాగ్రహారాల్లో సాధారణంగా పురుషుల కది స్నానాల సమయం.

స్నానం కాగానే మైలపడకుండా భోజనం చేస్తారు వారు, మరి.

అంచేత, పెద్దచెరువు పావంచాలూ, పావంచాల పొడూగునా యేడెనిమిది గజాల లోపలిదాకా చెరువూ బ్రాహ్మలతో నిండిపోయి వున్నాయి.

జంధ్యాలు కుడిచెవులకు తగిలించుకుని చెంబులు తోముకునే వారు కొందరు.

కభుర్లు చెప్పుకునేవారు కొందరు.

స్నానాలు చేసేవారు కొందరు.

ఛలోక్తులు విసిరేవారు కొందరున్నూ.

ఒకచోట వరకట్నాల బేరాలు.

ఒకచోట దొంగసాక్ష్యాల పన్నాగం.

ఒకచోట వడ్డీలెక్కల ఉపదేశాలు.

ఒకచోట మనోవర్తిదావాల ఆలోచనలు.

చెదిరిచెదిరి వొకొక్కచోట వేశ్యాప్రసంగాలు.

సంగీతాలు.

చాటుధారపద్యాలు.

ధర్మకారికలు.

హిందీటుమ్రిలు.

అర్ఘ్యప్రదానాలు.

అసావాదిత్యో బ్రహ్మాలు.

గాయత్రీజపాలు.

ఊతపదాలు.

ఈతాలు.

ఓః! రేవంతా మహాకోలాహలంగా వుంది.

అయితే, వొక్క బ్రాహ్మల పావంచాలే యిలా వున్నాయి.

ఇటు కమ్మవారి పావంచాలూ, యిటు తురకలపావంచాలూ కూడా నిర్జనంగా వున్నాయి.

కాని, పరకాయించగా, అటు ఉత్తరపుగట్టున, కడవలూ బిందెలూ పుచ్చుకుని డెబ్భయ్యెనభై మంది మాదిగస్త్రీలు వచ్చి వరాసగా నుంచున్నారు.

ఇటు, దక్షిణపుగట్టున, లోటీలు చేతబట్టి నలభై యాభై మంది తురకలు నుంచున్నారు వచ్చి

అదీ యిదీ కూడా చూశారు బ్రాహ్మలు, అంచెనోళ్ల మీద.

అయితే, అదేమిటో యిదెందుకో బోధపడలేదు, వొక్క రికీ గూడా.

కోలాహలం మాత్రం చప్పగా చల్లారింది, మంత్రించినట్టు.

మీదు మిక్కిలి, యెక్కడ లేని చురుకూ వచ్చింది వారి కందరికీ.

అష్టోత్తరశతగాయత్రికి సంకల్పించుకున్నవారు అప్పటి కయి నంతా బ్రహ్మార్పణం చేసి ఆచమించారు.

అర్ఘ్యప్రదానంతోనే సంధ్యావందనం పూర్తిచేశారు కొందరు.

సబ్బు తెచ్చుకున్నవారు వొట్టి చేతులతో నయినా వొళ్ళు తోముకోకుండా స్నానాలు పూర్తిచేసుకున్నారు.

బట్టలుతుక్కుందా మనుకున్నవారు చెంబులు ముంచుకో సాగారు.

మొత్తానికి, బ్రాహ్మ లందరూ ఉపదేశకాండ ముగించుకుని ఆచరణకాండ ప్రారంభించాటప్పటికి, యెన్నగ్గున్నల్లా వచ్చి బ్రాహ్మల రేవులో చివరి పావంచామీాద నుంచున్నా రిద్దరు తురకలు.

కరీము కరీమే.

లుంగీచుట్టబెట్టుకుని మాత్రం వున్నా డతను.

ఇక రెండోవాడు,—

కనురెప్పలు రెండుమూడుమా ట్లాడాటప్పటికి ఆమనిషి మాదిగ విస్సన్న అని తెలిసిపోయిం దందరికీ.

అతనూ లుంగీకట్టుకునే వున్నాడు.

అందరూ చకితు లయినారు.

అందరికీ చెవులు గళ్లుపడ్డాయి.

కళ్లు చిరతలు కమ్మాయి.

మనస్సులు చెదిరిపోయాయి.

నోళ్లు తాళాలుపడ్డాయి.

సరిగా యీసమయాన దక్షిణగట్టున యీలలు చెలరేగాయి.

అవ్యవధానంగా ఉత్తరపుగట్టున చప్పట్లు పిక్కటిల్లాయి.

అంతే.

అంతే.

కరీము, విస్సన్న కేసి—ఇస్మాయిలు కేసి చూస్తూ "అల్లా హో అకబర్" అన్నాడు.

ఇస్మాయిలు బ్రాహ్మలకేసి చూస్తూ అంతకంటే గట్టిగా "అల్లా హో అకబర్" అంటూ చేతులు పైకి విసిరేసుకున్నాడు.

ఉత్తరక్షణంలో గభీ మని పడ్డారిద్దరూ చెరువులో.

అగాధమైన మహాసముద్రంలో రెండు మహాపర్వతాలు విరుచుకుపడ్డట్టయింది.

చేటలతో చెరిగినట్టు బ్రాహ్మలందరిమీదా నీళ్లు చిందాయి.

కొంద రూపిరాడక ఉక్కిరిబిక్కిరయిపోయారు.

హఠాత్తుగా యెగిసిన కెరటాలకు తట్టుకోలేక కొంద రూగిపోయారు.

కాని, యెవరూ కోప్పడలేదు.

ఎందుకూ యేమీ అనలేదు.

మాటే ఆడలేదు.

త్రికాలజ్ఞానసంపన్నులయిన మహర్షులు సముద్రంలో వుందన్న బడబానలం, వారి సంతతివారయిన ఆ బ్రాహ్మలకు అప్పటి కప్పుడు ఆ చెరువులోనే సాక్షాత్కరించింది.

వెంటనే—యెలా వుండినవారలా వొడ్డెక్కేశారు బ్రాహ్మలు.

దక్షిణపు గట్టున మళ్లీ యీలలు వచ్చాయి.

ఉత్తరపుగట్టున మాదిగలు—స్త్రీపురుషులందరూ హోలో మంటూ వొక్కుమ్మడిగా చెరువులో దిగేశారు.

1934 నవంబరు ప్రబుద్ధాంధ్రనుంచి

(పెరిగింది)